
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



కరీంనగర్ 5 జిల్లా వార్తలు

సోమవారం 17 ఫిబ్రవరి 2025

చివరి మజిలీకి కష్టాలు

- అధ్వానంగా వైకుంఠధామాలు
- కనీస వసతులు లేక ఇబ్బందులు

6

మట్టి రోడ్లకు మహర్దశ

- ఎస్సీ కాలనీల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు
- కరీంనగర్ మండలానికి రూ.2.46 కోట్లు
- ఎన్నికల కోడ్ తర్వాత పనులు

8

ప్రమాదకరంగా వ్యవసాయబావులు

- కరువైన సూచికలు



మానకొండూర్-జమ్మికుంట ప్రధాన రహదారి పక్కన ఉన్న వ్యవసాయబావి

మానకొండూర్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మానకొండూర్-జమ్మికుంట ప్రధాన రహదారి పక్కన వ్యవసాయ బావులు ప్రమాదకరంగా ఉన్నాయి. మానకొండూర్ నుంచి జమ్మికుంట వరకు డబుల్ రోడ్డు నిర్మించారు. మండల కేంద్రం నుంచి పచ్చునూర్ వరకు 16 కిలోమీటర్ల మేర రోడ్డుకు పక్కన 10కి పైగా వ్యవసాయబావులు ఉన్నాయి. ఈ రోడ్డుపై ఆర్టీసీ బస్సులతోపాటు వందల సంఖ్యలో వాహనాలు ప్రతి నిత్యం తిరుగుతుంటాయి. రోడ్డు పక్కన ఉన్న 20 మీటర్ల లోతు వరకు ఉండి పూర్తి స్థాయిలో నీటితో ఉన్నాయి. వాహనాలు అదుపుతప్పితే బావుల్లోకి దూసుకెళ్లే అవకాశం ఉంది. దీంతో వాహనదారులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని ప్రయాణిస్తున్నారు. రోడ్డు పనులు చేసిన కాంట్రాక్టర్ బావుల వద్ద ఎలాంటి ప్రమాద సూచికలు ఏర్పాటు చేయకపోవడంపై ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి వ్యవసాయ బావుల వద్ద ప్రమాద సూచికలు ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.


అందరిచూపు ఉమ్మడి జిల్లా వైపు

- పట్టభద్రుల ఎన్నికల్లో 45 శాతం ఓట్లు ఇక్కడివే
- ప్రత్యేక దృష్టి పెట్టిన అభ్యర్థులు
- ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు ప్రయత్నాలు



పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉమ్మడి జిల్లా కీలక పాత్ర పోషించనుంది. 45.12 శాతం ఓట్లు ఇక్కడనే ఉండడంతో అభ్యర్థులందరి చూపు ఈ జిల్లాపైనే పడింది. నియోజకవర్గ పరిధిలో 42 అసెంబ్లీ సెగ్మెంట్లు ఉన్నాయి. కాంగ్రెస్‌కు చెందిన వారు 23 మంది, బీజేపీకి చెందిన వారు ఏడుగురు, బీఆర్ఎస్‌కు చెందిన 12 మంది ఎమ్మెల్యేలుగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఆరుగురు ఎంపీలు ఉండగా నలుగురు బీజేపీకి చెందిన వారు, ఇద్దరు కాంగ్రెస్‌కు చెందిన వారున్నారు. ఈ ఎన్నికల ఫలితాలు త్వరలో జరిగే స్థానిక ఎన్నికలపై ప్రభావం చూపే అవకాశముంది. దీంతో కాంగ్రెస్, బీజేపీ నాయకులు ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని వ్యూహాలు రచిస్తున్నారు.

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్



6

నేటి నుంచి విద్యార్థులకు కంటి పరీక్షలు

సుభాషనగర్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు సోమవారం నుంచి కంటి పరీక్షలు నిర్వహించనున్నట్లు జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ సాజిత అతహరి ఓ ప్రకటనలో తెలిపారు. ఐదు నెలల క్రితం మొదటి విడతలో రెసిడెన్షియల్ మోడల్ స్కూల్ కేజీబీవీల్లో చదువుతున్న విద్యార్థులకు కంటి స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించామన్నారు. వారిలో 596 మంది విద్యార్థులు కంటి చూపు సమస్యతో బాధపడుతున్నట్లు గుర్తించామని తెలిపారు. రెండో విడతలో ప్రభుత్వ పాఠశాలల్లో 5 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించామన్నారు. వారిలో 1992 మంది విద్యార్థులు కంటి చూపు సమస్యతో బాధపడుతున్నట్లు గుర్తించామని తెలిపారు. ఈ ఐదు నెలల కాలంలో సమస్య ఏ స్థాయిలో ఉంది గుర్తించడానికి విద్యార్థులకు తిరిగి స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తామన్నారు. జిల్లా ఆసుపత్రిలో1730 మందికి, హుజురాబాద్ ఏరియా ఆసుపత్రిలో 858 మంది విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తారని చెప్పారు. జిల్లా ఆస్పత్రిలో ప్రతిరోజు 858 మంది విద్యార్థులకు, హుజురాబాద్ ఏరియా ఆసుపత్రిలో వంద మంది విద్యార్థులకు స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. కంటి పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభించి 28 వరకు నిర్వహిస్తామన్నారు. విద్యార్థులను పాఠశాల నుంచి ఆసుపత్రులకు తరలించి కంటి పరీక్షల అనంతరం తిరిగి పాఠశాలల్లో వదిలిపెట్టడానికి ఆర్బీఎస్‌కే వాహనాలు, 102 ఇతర వాహనాలను వినియోగించుకుంటామని తెలిపారు.

సమ్మక్క సారలమ్మ గద్దెల వద్ద సౌకర్యాలు కరువు



రేకుర్తిలోని సమ్మక్కసారలమ్మగద్దెలు



నిరుపయోగంగా ఉన్న మంచినీటి ట్యాంకు

భగత్‌నగర్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): నగరంలోని రేకుర్తి సమ్మక్క సారలమ్మ గద్దెల వద్ద కనీస వసతులు లేక భక్తులు ఇబ్బంది పడుతున్నారు. ఈ గద్దెల వద్ద రెండు సంవత్సరాలకోసారి జాతర ఘనంగా జరుగుతుంది. మధ్యలో మినీ జాతర నిర్వహిస్తారు. ప్రతి మాఘ శుద్ధ పౌర్ణమి మొదలుకుని అమావాస్య వరకు ఇంట్లో దేవతలకు పూజలు నిర్వహించుకుని వన దేవతలకు మొక్కులు సమర్పించుకుంటారు రేకుర్తిలోని గుట్టపైకి పౌర్ణమి మొదలుకొని భక్తుల రాక మొదలైనా గుట్టపై వన దేవతలు వెలసిన ప్రాంతంలో అధికారులు కనీస వసతులు కల్పించలేదు. గుట్టపై మంచినీటి వసతితోపాటు, నీటి వసతి లేక పోవడంతో భక్తులు ఇబ్బంది పడుతున్నారు. నీళ్ల ట్యాంకు ఉన్నా నీటిని నింపడం లేదు.. సమ్మక్క, సారలమ్మల గద్దెల పరిసరాల్లో శుభ్రం చేయకపోవడంతో భక్తులు వంటలు చేసుకునేందుకు ఇబ్బందిపడతున్నారు. గద్దెల ప్రాంతంలో వంటలు చేసుకోవడానికి వసతి సౌకర్యంతో పాటు, భక్తులకు స్నానాల గదులు, శాశ్వత మంచినీటి వసతి, షెడ్లు ఏర్పాటు చేయాలని భక్తులు కోరుతున్నారు.

ప్రాక్టికల్స్‌కు గైర్హాజరైన ఇంటర్ విద్యార్థులకు మరొక అవకాశం

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలకు గైర్హాజరైన విద్యార్థులకు బోర్డు ఆఫ్ ఇంటర్మీడియట్ మరొక అవకాశం కల్పించింది. ఈనెల 3 నుంచి 16వ తేదీ వరకు ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ప్రాక్టికల్స్ నిర్వహిచారు. ఈ ప్రాక్టికల్స్ పరీక్షలకు హాజరు కాని విద్యార్థులు సప్లిమెంటరీలోకానీ, మరుసటి సంవత్సరం కానీ పరీక్షలు రాయాల్సి ఉండేది. ఈసారి అలాకాకుండా బోర్డు ఆఫ్ ఇంటర్మీడియట్ ఈనెల 18 నుంచి 22వ తేదీ వరకు ప్రత్యేకంగా ప్రాక్టికల్స్ నిర్వహించాలని నిర్ణయించింది. ఈ మేరకు ప్రాక్టికల్స్ పరీక్షలు నిర్వహించాలని ఆదేశిస్తూ బోర్డు ఆఫ్ ఇంటర్మీడియట్ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఇన్‌స్టంట్ ప్రాక్టికల్స్‌కు జిల్లా కేంద్రంలో ఒకే ఒక పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేసి ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్ కళాశాలల విద్యార్థులందరికీ ఇక్కడే పరీక్షలు నిర్వహిస్తారు. కరీంనగర్‌లోని ప్రభుత్వ ఆర్ట్స్ జూనియర్ కళాశాలలో నిర్వహించే ఈ ఇన్‌స్టంట్ ప్రాక్టికల్స్ హాజరుకావాలనుకునే విద్యార్థులు బోర్డు ఆఫ్ ఇంటర్మీడియట్ కార్యాలయంలో డీఐఈవోను సంప్రదించి అనుమతి తీసుకోవలసి ఉంటుంది.

బీసీల జనాభాను తగ్గించేందుకు కాంగ్రెస్ కుట్ర

- కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్

భగత్‌నగర్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ఒక వర్గానికి, మతానికి కొమ్ము కాసేందుకు కాంగ్రెస్ బీసీల జనాభాను తగ్గించే కుట్ర పన్నుతు న్నదని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ విమర్శించారు. జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ స్టేడియంలో నిర్వహిస్తున్న స్వదేశీ మేళా లో ఆదివారం ముగిసింది. ఈ కార్యక్రమానికి హాజరై బండి సంజయ్‌కుమార్ మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్లను 42 ఇస్తామని చెప్పి పది శాతం ఉన్న ముస్లింలను బీసీల్లో కలిపారన్నారు. దీంతో హిందూ బీసీలు తీవ్రంగా నష్టపోతారన్నారు. ముస్లింలను బీసీ జాబితాలో కలిపి కేంద్రానికి పంపితే కేంద్రం ఆమోదించే ప్రసక్తే లేదన్నారు. మహారాష్ట్రలో మాదిరిగా తెలంగాణలో మతమార్పిడిలు, లవ్ జిహాదీలపై చట్టం తీసుకురావాలన్నారు. రాజీవ్ గాంధీ హిందువే కాదని, ఆయన తండ్రి ఫిరోజ్ జహంగీర్ ఖాన్ పార్సి ముస్లిం సంతతికి చెందిన వారని అన్నారు. రాజీవ్‌గాంధీ భార్య సోనియా ఇటలీ దేశ క్రైస్తవురాలని, మరి రాహుల్ గాంధీ హిందూ ఎట్లా అవుతారని ప్రశ్నించారు. తండ్రి కులమే కొడుకుకు వర్తిస్తుందని, రాజీవ్ గాంధీ హిందువు అయినందున ఆయన కొడుకు రాహుల్ హిందువేనని కాంగ్రెస్‌నేతలు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. పర్షియాలోని ముస్లిం సంతతికి చెందిన వారు భారత్‌కు వచ్చి పార్సీలుగా మారారని, ఫిరోజ్‌ఖాన్ మతమే రాజీవ్ గాంధీకి వర్తిస్తుందని, అప్పుడు రాహుల్ గాంధీ హిందువు ఎలా అవుతారని ప్రశ్నించారు. టెన్ జన్‌పథ్‌లోని రాహుల్‌గాంధీ కుటుంబానికి కులం, మతం, జాతి, దేశం లేవన్నారు. మోదీ పక్కా ఇండియన్ అని, మోదీకి విదేశీయులే సాష్టాంగ నమస్కారం చేస్తున్నారని తెలిపారు. విదేశాల్లో ప్రతి భారతీయుడు 'ఇండియన్' అని గర్వంగా కాలర్ ఎగరేసి తలెత్తుకు తిరిగేలా మోదీ చేస్తున్నారన్నారు. స్వదేశీ మేళాలను పూర్తిగా సందర్శించి ప్రతి స్టాల్‌ను తిలకించి ఉత్పత్తులను పరిశీలించారు. స్వదేశీ జాగరణ్ మంచ్ చేస్తున్న కృషిని అభినందించారు.



స్వదేశీ మేళా ముగింపు కార్యక్రమంలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్

భక్తిశ్రద్ధలతో సంకటహర చతుర్థి

కరీంనగర్ కల్చరల్, ఫిబ్రవరి 16 (ఆంధ్ర జ్యోతి): నగరంలోని ఆలయాల్లో ఆదివారం సంకటహర చతుర్థి పూజలను భక్తులు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. భగత్‌నగర్ అంజనాద్రి లక్ష్మీగణపతి, జడ్పీ క్వార్టర్స్ ఆవరణలోని అయ్యప్ప, రాంపూర్ గిద్దెపెరుమాండ్ల, అశోక్‌నగర్ వాసవికన్యకాపరమేశ్వరి, ప్రకాశం గంజ్ వరసిద్ధి వినాయక స్వామి దేవాలయాల్లో అభిషేక, అలంకార, అర్చనలు నిర్వహించారు.



అంజనాద్రి లక్ష్మీ గణపతి ఆలయంలో హారతి

రీ సర్వేను సద్వినియోగం చేసుకోండి

- కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): తెలంగాణ సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వేలో వివిధ కారణాల వల్ల పాల్గొనని వారి కోసం రాష్ట్ర ప్రభుత్వం రీ సర్వే నిర్వహిస్తోందని కలెక్టర్ పమేలా సత్పతి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ నెల 16 నుంచి 28వ తేదీ వరకు 12 రోజులపాటు రీ సర్వే కొనసాగుతుందని, మూడు విధాలుగా వివరాలను నమోదు చేసుకోవచ్చన్నారు. జీహెచ్ఎంసీలో ప్రత్యేక కాల్ సెంటర్ 040-21111111 ఏర్పాటు చేశారని, ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ కాల్‌సెంటర్ పనిచేస్తుందన్నారు. కుటుంబ పెద్ద కానీ, కుటుంబ సభ్యుల్లో ఒకరు కాల్ సెంటర్‌కు ఫోన్ చేసి వివరాలను ఇవ్వాలని సూచించారు. గతంలో సర్వేలో పాల్గొనని వారు నేరుగా ప్రజాపాలన సేవ కేంద్రాల్లో సంప్రదించవచ్చన్నారు. పట్టణ ప్రాంతాల్లో మున్సిపల్ కార్యాలయాలు, గ్రామీణ ప్రాంతాల్లో ఎంపీడీవో కార్యాలయాల్లో ఈ సేవా కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. అక్కడ వివరాలను నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ఆన్‌లైన్‌లో సర్వే ఫారం డౌన్‌లోడ్ చేసుకొని వివరాలు నింపి ఆ ఫారాన్ని ప్రజాపాలన సేవా కేంద్రాల్లో ఇవ్వవచ్చని అన్నారు. ఈ మూడింటిలో ఏ పద్ధతిలోనైనా ఇప్పటి వరకు సర్వేలో నమోదు కానీ వారు రీ సర్వేలో వారి వివరాలను నమోదు చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు.

విద్యుత్ సమస్యలకు సత్వర పరిష్కారం



- ప్రత్యేక వాహనాలు, టోల్ ఫ్రీ నంబర్ 1912 ఏర్పాటు
- సాంకేతికతను జోడించి ఫిర్యాదుల పరిష్కారం

గణేశ్‌నగర్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా, సత్వర చర్యలు చేపట్టేందుకు విద్యుత్ శాఖ నూతన విధానాలకు శ్రీకారం చుట్టింది. సమస్యలు తెలుసుకునేందుకు 1912 టోల్ ఫ్రీ నంబర్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. జిల్లా వ్యాప్తంగా ప్రతి ట్రాన్స్‌ఫార్మర్‌పై టోల్ ఫ్రీ నంబర్ 1912 ను ముద్రించారు.



ప్రత్యేక వాహనాలు

● టోల్ ఫ్రీ సేవలు విస్తృతం

టీజీ ఎన్‌పీడీసీఎల్ పరిధిలోని విద్యుత్ వినియోగదారులకు మరింత మెరుగైన సేవలు అందించే క్రమంలో టోల్ ఫ్రీ సేవలను మరింత విస్తృత పరిచారు. కార్పొరేట్ కార్యాలయం నుంచి టోల్ ఫ్రీ సేవలు నిర్వహిస్తున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల ఫెయిల్యూర్లు, విద్యుత్ సరఫరాలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తినా, బిల్లులో ఏమైనా హెచ్చు తగ్గులు ఉన్న , ఫ్యూజ్ ఆఫ్ కాల్స్, విద్యుత్ మీటర్ల మార్పు, అన్ని రకాలకొత్త సర్వీసుల మంజూరుకు సంబంధించిన పేరు మార్పు, కేటగిరీ మార్పు, లోడ్ మార్పు తదితర సమస్యల పరిష్కారానికి టోల్ ఫ్రీ నంబర్‌ను సంప్రదించవచ్చు. విద్యుత్ వినియోగదారుడు 1912కు ఫోన్ చేయగానే ఫిర్యాదును స్వీకరించి నమోదు చేస్తారు. ఫిర్యాదు సమాచారాన్ని సంబంధిత అధికారికి పంపుతారు. ఈ విషయం ఫిర్యాదు దారుడికి మెసేజ్ రూపంలో తెలియజేస్తారు. ఫిర్యాదును ఆ అధికారి పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటారు.



విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లపై ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నంబర్ 1912

● అత్యవసర సేవలకు ప్రత్యేక వాహనాలు

అత్యవసర సేవల కోసం ప్రత్యేక వాహనాలు ఏర్పాటు చేశారు. వేసవిలో విద్యుత్ వినియోగం గణనీయంగా పెరుగుతుంది. అదే స్థాయిలో సమస్యలు తలెత్తుతాయి. సమస్య అధికారుల దృష్టికి వెళ్లి సరఫరాను పునరుద్ధరించేందుకు గంటల సమయం పడుతుంది. ఈ పరిస్థితి ఉండకూడదనే టోల్ ఫ్రీ నంబరు, డివిజన్, సర్కిల్ కార్యాలయాల్లో కంట్రోల్ రూమ్స్ ఏర్పాటు చేస్తున్నారు. సమస్య తలెత్తగానే అధికారులకు ఫోన్‌చేసి తెలియజేయవచ్చు. వెంటనే సిబ్బంది ప్రత్యేక వాహనంలో సమస్య తలెత్తిన ప్రాంతానికి చేరుకుని మరమ్మతులు చేపడతారు. వాహనంలో విద్యుత్ తీగలు, ఫ్యూజులు, తాళ్లు, పవర్ రంపం, నిచ్చెన వంటి సామగ్రి ఉంటాయి. ట్రాన్స్‌ఫార్మర్లలో ఏమైనా సమస్యలు తలెత్తితే వెంటనే మార్చేందుకు మరో ట్రాన్స్‌ఫార్మర్ అందుబాటులో ఉంటుంది.

విద్యుత్ శాఖ సేవలు సద్వినియోగం చేసుకోండి

- ఎస్ఈ, మేక రమేష్ బాబు



జిల్లాకు ప్రత్యేక వాహనాలు అందుబాటులోకి వచ్చినవి. విద్యుత్ సమస్య తలెత్తితే 1912 టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్ చేసినా అందుబాటులో ఉన్న సిబ్బందికి తెలియజేసినా మా సిబ్బంది వెంటనే వెళ్లి పరిష్కరిస్తారు. రానున్న రోజుల్లో ఇతర ప్రాంతాలకు వాహనాలు అందుబాటులోకి రానున్నాయి. ఈ సేవలను వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలి.

ఆన్‌లైన్ గేములకు యువకుడి బలి

● అప్పుల పాలై ఆత్మహత్య

శంకరపట్నం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ గేములకు బానిసైన ఓ వ్యక్తి అప్పులపాలై మనస్థాపం చెంది పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకోగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శంకరపట్నం మండలంలోని ఇప్పలపల్లి గ్రామానికి చెందిన ఏడిగ మధు(33) ఆన్‌లైన్, బెట్టింగ్ గేమ్స్ ఆడి అప్పులు పాలయ్యాడు. అప్పులు తీర్చే మార్గం లేక మనస్థాపంతో ఈనెల 10న తన ఇంటి వద్ద ఎవరూ లేని సమయంలో గడ్డి మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు 108లో కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. మృతుడి భార్య గీత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కొత్తపల్లి రవి తెలిపారు.

పురుగుల మందు తాగి వృద్ధుడు ఆత్మహత్య

శంకరపట్నం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం మెట్‌పల్లి గ్రామంలో ముప్పిడి రాంరెడ్డి(72) అనే వృద్ధుడు పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చిగురుమామిడి మండలం చిన్న ముల్కనూర్ గ్రామానికి చెందిన రాంరెడ్డి ఈనెల 15న రాత్రి మెట్‌పల్లి గ్రామంలోని తన బామ్మర్ది తుమ్మల పురుషోత్తంరెడ్డి ఇంటికి వచ్చాడు. రాంరెడ్డి కుటుంబ సభ్యులు దూర మవడం వలన తాగుడుకు బానిసయ్యాడు. బామ్మర్ది పురుషోత్తంరెడ్డి ఇంట్లో లేని సమయంలో పురుగుల మందు తాగి మృతిచెందాడు. మృతుడి బామ్మర్ది పురుషోత్తంరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కొత్తపల్లి రవి తెలిపారు.

బైక్ అదుపుతప్పి యువకుడి మృతి


మహిపాల్ (ఫైల్)

ధర్మారం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): బైక్ అదుపు తప్పి యువకుడు మృతి చెందిన సంఘటన ధర్మారం మండల కేంద్రంలో చోటుచేసుకుంది. శనివారం మండల కేంద్రానికి చెందిన నార మహిపాల్ (32)అనే యువకుడు బైక్‌పై ఎండపల్లి నుంచి ధర్మారం లోని ఓఫంక్షన్‌హాల్‌లో జరిగే వేడుకకు వస్తుండగా బైక్ అదుపు తప్పి కింద పడ్డాడు. దీంతో మహిపాల్ తలవెనుక భాగంలో తీవ్రగాయాలు కాగా పక్క టెములకు విరిగాయి. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు హుటా హుటిన హాస్పిటల్‌కు తరలించారు. పరిస్థితి విషమించడంతో శని వారం రాత్రి చికిత్స పొందుతూ మహిపాల్ మరణించాడు. యువ కుడి తమ్ముడు జైపాల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శీలం లక్ష్మణ్ తెలిపారు.

ఆర్టీసీ బస్టాండ్‌లో ఒకరు..

సుల్తానాబాద్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ ఆర్‌టీసీ బస్టాండ్‌లో చెన్నైకి చెందిన జీవా(55) అనేవ్యక్తి మృతిచెందినట్లు ఎస్ఐ శ్రావణ్‌కుమార్ తెలిపారు. ఆరునెలల క్రితం జీవా సుల్తానాబాద్ వచ్చాడని, ఇతను సమీప ప్రాంతాలలో దినసరి కూలీ చేస్తూ మద్యం తాగుతు బస్టాండ్‌లోనే పడుకుంటున్నాడని వివరించారు. శనివారం జీవా అధికంగా మద్యం సేవించి బస్టాండ్ ఆవరణలో నిద్రించగా అలాగే మృతిచెందాడు. ఆదివారం సాయంత్రం కొందరు గుర్తించడంతో సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించామని, సహచర కూలి హరి ఫిర్యాదుమేరకు కేసునమోదు చేశామని ఎస్ఐ వివరించారు.

ప్రమాదవశాత్తు నిప్పంటుకుని వృద్ధురాలు..

కథలాపూర్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని తక్కళ్లపల్లికి చెందిన గడ్డమీద గంగు(72) అనేవృద్ధురాలి చీరెకు ప్రమాదశాత్తు నిప్పంటుకుని మృతి చెందింది. ఎస్సై నవీన్‌కుమార్ కథనం ప్రకారం.. శనివారం రాత్రి సిలిండర్‌పై టీ తయారు చేసుకుంటున్న క్రమంలో ప్రమాదాశాత్తు చీరెకు నిప్పు అంటుకుంది. దీంతో తీవ్రగాయాలైన గంగును జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందినట్టు తెలిపారు. మృతురాలు గంగు కొడుకు గంగనర్సయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు శవ పంచనామా నిర్వహించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై చెప్పారు.

కుంభమేళాకు వెళ్లి వస్తుండగా రోడ్డు ప్రమాదం

● చికిత్స పొందుతూ మహిళ మృతి


ప్రమీల (ఫైల్)

ధర్మపురి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): కుంభమేళాకు కుటుంబసభ్యులతో కలిసి వెళ్లిన మహిళ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందింది. జగిత్యాలజిల్లా ధర్మపురి పట్టణానికి చెందిన వెంగళ ప్రమీల(52) అనే మహిళ తన ఇద్దరు కొడుకులు, కోడళ్లు మనుమ రాళ్లతో కలిసి ప్రయాగ్‌రాజ్ (కుంభమేళా)కు మూడు వాహనాల్లో వెళ్లారు. అనంతరం తిరిగి ఇంటికి వస్తుండగా మధ్యప్రదేశ్‌లోని రేవా ప్రాంతంలో గురువారం ప్రమీల ప్రయాణిస్తున్న కారు అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ప్రమీల తీవ్రంగా గాయపడడంతో సమీపంలోని ఆసుపత్రిలో చేర్పించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ప్రమీల పరిస్థితి విషమించి ఆదివారం మృతిచెందింది. ప్రమీల మృత దేహాన్ని ఆమెస్వగ్రామమైన జూలపల్లికి తరలిస్తున్నట్లు సమాచారం.

మంగళపల్లెలో ట్రాక్టర్ దగ్ధం


దగ్ధమవుతున్న ట్రాక్టర్

కోనరావుపేట, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు నిప్పు అంటుకొని ఓరైతుకు చెందిన ట్రాక్టర్ పూర్తిగా దగ్ధమైంది. కోనరావుపేట మండలం మంగళపల్లె గ్రామానికి చెందిన ఉప్పుల జీవన్ అనే రైతు తన ట్రాక్టర్‌ద్వారా చేనులో పత్తికట్టె చదునుచేస్తున్నాడు. పక్కకు నెట్టేసిన పత్తి కట్టకు అప్పటికే నిప్పు అంటించారు. పత్తి కట్టే వైపు మిగతా చేనులోని పత్తి కట్టను నెట్టే ప్రయత్నంలో కందకంలో ట్రాక్టర్ దిగబడింది. ఆభాగంలోని మండుతున్న పత్తికట్టె ట్రాక్టర్‌టైర్‌కు అంటుకొని మంటలు చెలరేగాయి. మంటలను ఆర్పే ప్రయత్నం చేసినప్పటికీ ట్రాక్టర్ పూర్తిగా దగ్ధమైంది. దీంతో బాధిత రైతుకు మూడులక్షల వరకు నష్టం వాటిలినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు

అటవీ ప్లాంటేషన్‌లో మంటలు

వీర్నపల్లి, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): వీర్నపల్లి మండలం బాబాయి చెరువుతండా గ్రామశివారులోని అటవీప్రాంతంలో ప్రమాదవశాత్తు మంటలు వ్యాపించడంతో పది హెక్టార్ల ప్లాంటేషన్ మొక్కలు ఆదివారం కాలిపోయాయి. విషయం తెలుసుకున్న అటవీశాఖ అధికారులు సంఘటన స్థలానికిచేరుకొని అగ్నిమాపకశాఖకు సమాచారం అందించడంతో ఫైర్‌ఇంజన్, ఫైర్ బ్లోయర్స్‌తో మంటలను చల్లార్చారు. అడవుల సంరక్షణ అందరి బాధ్యత అని అటవీశాఖ సెక్షన్ అధికారి భూలక్ష్మి పేర్కొన్నారు.

ఫోర్జరీ కేసులో నలుగురిపై కేసు

మానకొండూర్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : మానకొండూర్‌లోని వ్యవసాయభూమి ఫోర్జరీ కేసులో నలుగురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ లక్ష్మీనారాయణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మానకొండూర్‌కు చెందిన కిష్టయ్య పూర్వీకులకు చెందిన భూమికి నకిలీ సాదాబైనామా తయారు చేసి మోసపూరితంగా మ్యూటేషన్ చేసిన కేసులో వినయ్‌రావు, వీరయ్య, దివ్య, వెంకటేశ్వర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

అందరి చూపు.. ఉమ్మడి జిల్లా వైపు..

- పట్టభద్రుల ఎన్నికల్లో 45 శాతం ఓట్లు ఇక్కడివే
- ప్రత్యేక దృష్టి పెట్టిన అభ్యర్థులు
- ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు ప్రయత్నాలు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉమ్మడి జిల్లా కీలకంగా మారింది. కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాల పరిధికి సంబంధించిన ఈ ఎమ్మెల్సీ స్థానంలో ఉన్న ఓట్లలో 45.12శాతం ఓట్లు ఉమ్మడి జిల్లాలోనే ఉన్నాయి. దీంతో అన్ని రాజకీయ చాటుకోవడానికి ఈ ఫలితం ఊతంగా నిలుస్తుందని రాజకీయ పార్టీలు భావిస్తున్నాయి. నియోజకవర్గ పరిధిలో 42 అసెంబ్లీ సెగ్మెంట్లు ఉండగా కాంగ్రెస్‌కు చెందిన వారు 23 మంది, బీజేపీకి చెందిన వారు ఏడుగురు, బీఆర్ఎస్‌కు చెందిన12 మంది ఎమ్మెల్యేలుగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఈ పరిధిలో ఆరుగురు ఎంపీలు ఉండగా నలుగురు బీజేపీకి చెందిన వారు, ఇద్దరు కాంగ్రెస్ వారున్నారు. బీఆర్ఎస్ పోటీ నుంచి తప్పుకోవడంతో కాంగ్రెస్, బీజేపీ ఈ పట్టభద్రుల స్థానాన్ని గెలుచుకోవడం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్నాయి. అందుకే ఆ రాజకీయ పక్షాలు పట్టభద్రుల



పార్టీలు, అభ్యర్థుల దృష్టి ఈ జిల్లాపైనే కేంద్రీకృతమవుతున్నది. పోటీలో ఉన్న అభ్యర్థులందరూ కరీంనగర్ జిల్లా కేంద్రంలో మకాం వేసి తమ ప్రచారాలను కొనసాగిస్తున్నారు.

● **పట్టు సాధించేందుకు..**

త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు జరుగనుండడంతో ఇక్కడి ఫలితాలు ఆ ఎన్నికలపై ప్రభావం చూపించే అవకాశాలు ఉన్నాయని రాజకీయవర్గాలు భావిస్తున్నాయి. ఈ ఎన్నికల నుంచి బీఆర్ఎస్ పోటీ నుంచి తప్పుకోగా, కాంగ్రెస్, బీజేపీ బరిలో ఉన్నాయి. ఇక్కడ గెలుపు సాధించడం ద్వారా వచ్చే ఎన్నికల్లో గెలుపు తమదేనని, స్థానిక సంస్థల ఎన్నికల్లోనే కాదు ఏ ఎన్నికలు వచ్చినా ప్రజల్లో తమకు ఉన్న పట్టేమిటో ఎన్నికల ఫలితాలను నిర్దేశించే స్థాయిలో ఉన్న ఉమ్మడి కరీంనగర్ జిల్లాపైనే ప్రత్యేక దృష్టిసారించాయి.

● **పోటాపోటీగా ఆత్మీయ సమ్మేళనాలు**

రెండు రాజకీయ పక్షాలు నియోజకవర్గ స్థాయిలో పార్టీశ్రేణులు, నాయకులు, పట్టభద్రులతో ఆత్మీయ సమ్మేళనాలు ఏర్పాటు చేస్తున్నాయి. క్షేత్రస్థాయిలో 25, 50 ఓట్లకు ఒక్కరిని ఇన్‌చార్జిగా నియమించి ఆ ఓటరుతో సత్సంబంధాలు పెట్టుకొని రోజూ మాట్లాడుతూ పోలింగ్ రోజు వారిని పోలింగ్ కేంద్రానికి తీసుకొని వచ్చి ఓటు వేసేలా చూడాలని బాధ్యతలు అప్పగిస్తున్నాయి. ఓటర్లను నేరుగా కలిసేందుకు వీలులేని పరిస్థితి ఉండ డంతో పార్టీ కేడర్‌పైనే ప్రధాన బాధ్యతను ఉంచుతు న్నారని చెబుతున్నారు. ఇరు పార్టీలకు చెందిన నాయకులు, ప్రత్యర్థి పార్టీవారు తమ తమ సమావే శాల్లో మాట్లాడుతున్న అంశాలు ఏమిటి, వారు పన్ను తున్న వ్యూహాలు ఏమిటి అనే విషయాలు తెలుసుకునే ప్రయత్నాలు చేస్తున్నాయి.

● **నియోజకవర్గ స్వరూపం**

నియోజకవర్గ పరిధిలోకి 13 జిల్లాలు పూర్తిగా, 2 జిల్లాలు పాక్షికంగా వస్తాయి. ఆరు పార్లమెంట్ స్థానాలు, 42 అసెంబ్లీ సెగ్మెంట్ల పరిధిలో ఈ ఎమ్మెల్సీ నియోజకవర్గం ఉన్నది. నియోజకవర్గ పరిధిలో 2,26, 765 మంది పురుషులు, 1,28,392 మహిళలు, ఇద్దరు థర్డ్‌జెండర్లు ఓటర్లుగా ఉన్నారు. మొత్తం నియోజకవర్గ పరిధిలో 3,55,159 ఓట్లు ఉన్నాయి. వీటిలో 1,60,260 ఓట్లు ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలోనే ఉన్నాయి. ఈ ఓట్లు నియోజకవర్గ పరిధిలోని మొత్తం ఓట్లలో 45.12శాతం కావడం గమనార్హం. కరీంనగర్ జిల్లాలో 71,545 ఓట్లు, పెద్దపల్లి జిల్లాలో 31,037 ఓట్లు, జగిత్యాల జిల్లాలో 35,281 ఓట్లు, రాజన్న సిరిసిల్ల జిల్లాలో 22,397 ఓట్లు ఉన్నాయి. కరీంనగర్ జిల్లా ఓట్లనే పరిగణలోకి తీసుకున్నా 20 శాతం ఓట్లు ఇక్కడే ఉన్నాయి. రాష్ట్రం లోని 119 అసెంబ్లీ నియోజకవర్గాలలో 42 అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన పట్టభద్రులు ఓట ర్లుగా ఉన్న ఈ నియోజకవర్గానికి ఎన్నికలు జరుగు తుండడంతో ఈ ఎన్నికలకు రాజకీయ ప్రాధాన్యం పెరిగింది.

● **ప్రచారంలో కీలకమవుతున్న బీసీ, స్థానిక నినాదాలు**

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో స్థానిక, బీసీ నినాదాలు కీలకపాత్ర వహిస్తున్నాయి. నియోజకవర్గ పరిధిలో ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన ఓట్లే 45శాతం కావడంతో స్థానిక నినాదం బలంగా వస్తున్నది. అల్ఫోర్స్ నరేందర్‌రెడ్డి కరీంనగర్ జిల్లాకు చెందిన వారనే కారణంతోనే ఆయనకు కాంగ్రెస్ టికెట్ ఇచ్చింది. ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలోని ప్రాంతాల నుంచి నామినేషన్ వేసిన అభ్యర్థులందరూ తాము స్థానికులమని, తమకు అవకాశం కల్పించాలని ప్రచారం చేసుకుంటున్నారు. ఈ ఎన్నికల్లో బీసీ నినాదం బలంగానే వినవస్తున్నది. ఒకవైపు బీసీ కుల గణన జరుగుతుండడం, మరోవైపు రాష్ట్రంలో బీసీల రిజర్వేషన్లు పెంచాలని రిజర్వేషన్ల విషయంలో ఇప్పటికే తమ రాజకీయ అవకాశాలను కాలరాస్తున్నారని బీసీ వర్గాలు పలు రకాల కార్యక్రమాలను చేపడుతున్నాయి. బీసీ వాదం బలంగా ఉండడంతో ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు అగ్రవర్ణాలకు చెందినవారని, బీసీ కులానికి చెందిన తమకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆయా అభ్యర్థులు ప్రచారం చేసుకుంటున్నారు. స్థానిక, బీసీ నినాదాలు ఎన్నికల ఫలితాలపై ప్రభావం చూపవచ్చనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది.

పోలీసులు పట్టించుకోవడం లేదు..

● న్యాయం చేయాలని సెల్‌టవర్ ఎక్కి నిరసన తెలిపిన బాధితుడు


కేశపట్నంలో పురుగుల మందు డబ్బాతో సెల్ టవర్‌పై నిరసన వ్యక్తం చేస్తున్న బాధితుడు కొంరయ్య

శంకరపట్నం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): పోలీసులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని తనకు న్యాయం చేయాలని శంకరపట్నం మండలం కేశవపట్నంలో సెల్‌టవర్ ఎక్కి ఓవ్యక్తి నిరసన తెలిపిన సంఘటన చోటు చేసుకుంది. సైదాపూర్ మండలం ఎక్లాస్‌పూర్ గ్రామానికి చెందిన దుర్గం కొంరయ్య ఆదివారం శంకరపట్నం మండలం కేశవపట్నం గ్రామంలోని సెల్‌టవర్ ఎక్కి నిరసన తెలిపాడు. బాధితుడు కొంరయ్య మాట్లాడుతూ తన తమ్ముడు తిరుపతి రేకులు కూల్చి తనభార్యను కొట్టడంతో మనస్థాపం చెంది 15రోజుల క్రితం పురుగుల మందుతాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడిందన్నారు. చికిత్స పొందుతూ శనివారం డిశ్చార్జ్ చేసి ఇంటికి తీసుకొచ్చినట్లు తెలిపారు. అయితే తన భార్యను కొట్టిన తమ్ముడిపై సైదాపూర్ పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేసిన ఎస్ఐ పట్టించుకోలేదన్నారు. తనకు న్యాయం జరగలేదంటూ ఆరోపించారు. తనకు న్యాయం చేయాలని సెల్‌టవర్ ఎక్కి నిరసన తెలిపారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని బాధితుడిని సెల్‌టవర్ దించేందుకు ప్రయత్నాలు చేశారు. తనకు న్యాయం జరిగేలా చూస్తానంటేనే దిగుతానని, లేదంటే ఇక్కడే ఉంటానని భీష్మించుకొని కూర్చున్నాడు. పోలీసులు అతనికి న్యాయం చేస్తామని హామీ ఇచ్చి నచ్చజెప్పి కిందకి దింపి పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లారు.

షార్ట్ సర్క్యూట్‌తో గుడిసె దగ్ధం

● కాలి బూడిదైన నగదు, నిత్యావసర సరుకులు


చింతకుంటలో కాలిపోయిన గుడిసె

కథలాపూర్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతకుంటలో శనివారం రాత్రి షార్ట్ సర్క్యూట్ కారణంగా ఆలకుంట చిలుకవ్వ అనే మహిళ గుడిసె దగ్ధమైంది. విద్యుత్‌వైర్లు అంటుకోవడంతో ఒక్కసారిగా నిప్పురవ్వలు వచ్చి మంటలు వ్యాపించాయి. ఇంట్లో నిద్రిస్తున్న కుటుంబసభ్యులకు మెలకువ రావడంతో బయటకు పరుగులు పెట్టారు. దీంతో ఎలాంటి ప్రాణానష్టం జరగలేదు. ఇంట్లో ఉన్న 22 వేల రూపాయలు, నిత్యావసర వస్తువులు, బట్టలు పూర్తిగా కాలిబూడిదయ్యాయి. ఆదివారం కాంగ్రెస్ నాయకులు బాదితురాలి ఇంటికి వెళ్లి పరామర్శించారు. అధికారులతో మాట్లాడి న్యాయం చేస్తామని చెప్పారు. కాగా కూలీ పనిచేసుకుంటూ జీవనం గడుపుతున్న చిలుకవ్వ కుటుంబం ఈ ఘటనతో బజారున పడింది.

ఓదెల మల్లన్న ఆలయంలో అభివృద్ధి పనులు

- రూ.12.18 కోట్లతో అభివృద్ధి ప్రణాళికలు
- నిర్మాణ దశలో భక్తుల వసతి భవనాలు


నిర్మాణ దశలో భక్తుల వసతి గృహం

ఓదెల, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ఓదెల భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయంలో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి. ప్రముఖ ఆలయమైన ఓదెల భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయ అభివృద్ధికి రూ.12.18కోట్లతో ప్రణాళికలను దేవాదాయ, ధర్మదాయ శాఖకు ప్రతిపాదించారు. అలాగే ఇందులో కొన్ని అభివృద్ధి పనులను చేపట్టారు. రూ.50 లక్షలతో భక్తులకు వసతి భవనాలు నిర్మాణ దశలో ఉన్నాయి. ఆలయానికి రూ.47 లక్షల వ్యయంతో రథం, రూ. 50 లక్షలతో షెడ్ల నిర్మాణం, రూ.20 లక్షల వ్యయంతో సామూహిక మరుగుదొడ్ల నిర్మాణం కోసం అనుమతులు పొందారు. దాదాపు రూ.50 లక్షల వ్యయంతో మధున పోచమ్మ, బంగారు పోచమ్మ, కోనేరు నిర్మాణం కాగా, రూ.10 కోట్ల నిధుల వ్యయంతో ఆలయ ప్రాకారానికి, రాజగోపురానికి డీపీఆర్ తయారుచేసి ప్రభుత్వానికి పంపించారు.

● **దాతల సహకారంతో అభివృద్ధి పనులు**

ప్రస్తుతం ఆలయంలో బంగారు పోచమ్మ, మదన పోచమ్మ, గుడిలో భక్తులకు కోనేరు పనులు పూర్త య్యాయి. దాతల సహకారంతో వీరభద్ర స్వామి ఆల యం నిర్మాణం పూర్తయి ప్రారంభమైంది. హైమాస్ట్ విద్యుత్ దీపాల ఏర్పాటు, మదన పోచమ్మ, బంగారు పోచమ్మ ఆలయం చుట్టూ ప్రహరీ పనులు సాగుతున్నాయి. కాంట్రాక్టర్ సొంతంగా రూ.60 లక్షలతో గెస్ట్ హౌస్ నిర్మిస్తున్నారు. అలాగే కాలభైరవ విగ్రహానికి తొడుగులు ఏర్పాటు చేశారు. ఆలయ సందర్శనకు వచ్చే వృద్ధులు, దివ్యాంగులకు వీల్ చైర్, రెండు కూలర్లు ఏర్పాటు చేశారు.

● **మిగిలిన అభివృద్ధి పనులు**

ఆలయ పరిసరాల్లో మహాశివరాత్రి సందర్భంగా భక్తుల సౌకర్యం కోసం సామూహిక మరుగుదొడ్లు, స్నానాల గదులు నిర్మాణం చేయాల్సి ఉంది. పెద్దపల్లి, సుల్తానాబాద్, ఓదెల పట్టణంలో ఆలయ కమాన్ నిర్మించాల్సి ఉంది. ఇప్పటికే కమిటీల తీర్మానాలు అధికారులకు పంపించారు. దుస్తులు మార్చుకు నేందుకు షెడ్ల నిర్మాణం చేయాల్సి ఉంది. అలాగే భక్తుల బోనాల తయారీకి షెడ్ల నిర్మాణం చేయాల్సి ఉంది. భక్తులకు సరిపడు స్థలం కోసం భూసేకరణ తోపాటు, ఇతర అభివృద్ధి పనులను వేగవంతం చేయవలసిన అవసరం ఎంతైనా ఉంది.

ఆలయ అభివృద్ధికి దాతలు ముందుకు రావాలి

\- సదయ్య ఈవో ఓదెల



ఓదెల మల్లికార్జునస్వామి ఆలయ అభివృద్ధికి దాతలు ముందుకు రావాలి. దేవాదాయ, ధర్మాదాయ శాఖ నుంచి నిధుల కేటాయింపు కొంత పరిమితంగా ఉంటుంది. భక్తుల సౌకర్యం కోసం అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం.

చివరి మజిలీకి కష్టాలు

● అధ్వానంగా వైకుంఠధామాలు ● కనీస వసతులు లేక ఇబ్బందులు


మానకొండూర్: శ్రీనివాస్‌నగర్‌లో వైకుంఠధామంలో ధ్వంసమైన దింపుడు కల్లం గద్దె


గంగాధర: నిరుపయోగంగా లక్ష్మీదేవిపల్లి వైకుంఠధామం

గంగాధర, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): శ్మశాన వాటిల్లో అంత్యక్రియలు చేయడానికి సౌకర్యాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతు న్నారు. లక్షలు వెచ్చించి నిర్మించిన వైకుంఠ ధామాలు నిరూపయోగంగా మారుతున్నాయి. గంగాధర మండలంలో అన్ని గ్రామాల్లో ప్రభుత్వం ప్రజలందరికి చివరి మజిలీ సాఫీగా సాగాలని ఆధునిక వైకుంఠధామాలు నిర్మించారు. పలు గ్రామాల్లో మునుపటి లాగా చెరువు గట్టుకో, వాగు ఒడ్డునో, సొంత స్థలాలు ఉన్న వారు వారి భూముల్లో అంత్యక్రియలు చేస్తుంటే భూముల్లేని పేదలు అంత్యక్రియలకు ఇబ్బందులు పడుతుండేవారు. శ్మశాన వాటికలు నిర్మించడంతో ఈ సమస్యలు చాలావరకు తగ్గాయి. మండలంలోని రెండు గ్రామాల్లో మాత్రం అధికారుల నిర్లక్ష్యం వల్ల అంత్యక్రియలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. హిమ్మత్‌నగర్, లక్ష్మీదేవిపల్లి గ్రామాల్లో వైకుంఠధామాలు నిర్మించారు. శ్మశాన వాటికలకు దారుల లేక ఇప్పటికి సొంత స్థలాల్లో, పేదలు వాగు ఒడ్డున అంత్యక్రియలు జరుపుతున్నారు. మూడేళ్లుగా ఈ గామాల్లో నిర్మించిన వైకుంఠదామాలు వినియోగించడానికి వీలు లేకుండా పోయింది. పలుమార్లు ఈగ్రామాల్లోని వైకుంఠదామాల దారి సమస్యను పరిష్కరించాలని అధికారులను కోరినా స్పందంచడంలేదని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● **మరమ్మతులు కరువు**

మానకొండూర్: మండలంలోని శ్రీనివాస్‌నగర్ గ్రామంలో నిర్మించిన వైకుంఠధామం పైకప్పు ఈదురు గాలులకు లేచిపోయింది. రెండేళ్లుగడిచినా మరమ్మతులు చేయడం లేదు. దింపుడు కల్లం గద్దె, మృతదేహాలను కాల్చే ప్రదేశం, ప్రవేశద్వారం దెబ్బతిన్నాయి. వైకుంఠధామంలో పిచ్చి చెట్లు మొలిచి అందులోకి వెళ్లలేని పరిస్థితి ఉంది. గ్రామంలో ఎవ్వరు మృతి చెందిన వారి పొలాల్లో దహన సంస్కారాలు చేసుకుంటున్నట్లు తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వైకుంఠధామంలో సౌకర్యాలు కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్లాట్‌ఫాంపైకి దూసుకువచ్చిన ఆర్టీసీ బస్సు

● మహిళకు స్వల్పగాయాలు

వేములవాడ టౌన్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): రాజన్నసిరిసిల్ల జిల్లా వేములవాడ మున్సిపల్ పరిధి తిప్పాపూర్ ఆర్టీసీ బస్టాండులో ఆదివారం ప్లాట్‌ఫాం పైకి బస్సు దూసుకురావడంతో మహిళకు స్వల్ప గాయాలయ్యాయి. వేములవాడ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు జగి త్యాల వెళ్లేందుకు ప్లాట్‌ఫాం వద్దకు వచ్చే క్రమంలో నిర్దేశిత స్థానాన్ని దాటుకుని ముందుకు వేగంగా దూసుకువచ్చింది. అప్రమత్తమైన ప్రయాణికులు అక్కడినుంచి తప్పించుకున్నారు. అక్కడేఉన్న ఓ మహిళచేతికి స్వల్పగాయమైంది. వెంటనే ఆర్టీసీ అధికారులు ఆమెను ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. ప్రయాణికులు సమయస్ఫూర్తితో వ్యవహరించడంతో పెద్దప్రమాదం తప్పిందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు.

గంజాయితో పట్టుబడ్డ వ్యక్తికి రిమాండ్

రుద్రంగి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం శివారులోని నేవూరిపల్లి బస్టాండ్ వద్ద గంగాధర గ్రామానికి చెందిన పోత్నూరి రాకేష్ అనే వ్యక్తి వద్ద గంజాయి పట్టుకున్నామని చందుర్తి సీఐ వేంకటేశ్వర్లు తెలిపారు. విచారణ అనంతరం నిందితుడిని అరెస్ట్ చేసి జ్యూడిషియల్ రిమాండ్ తరలించామని తెలిపారు.

అడవుల సంరక్షణకు

'ఫైర్‌లైన్స్'

- అగ్నిప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు
- నిరంతరం అటవీ శాఖ అధికారుల నిఘా
- పెరుగుతున్న అటవీ సంపద

వీర్నపల్లి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : వేసవికాలం వచ్చిందంటే ఏటా అడవులకు నిప్పంటుకోవడం సర్వ సాధారణంగా మారింది. అడవిలో అగ్ని ప్రమాదాల వల్ల వృక్ష సంపద, వన్యప్రాణులకు హాని కలిగే పరిస్థితులు నెలకొంటున్నాయి. అడవుల్లో అగ్ని ప్రమాదాల వల్ల వాతావరణ సమతుల్యం కూడా దెబ్బతినే ప్రమాదం ఉంటుందని నిపుణులు పేర్కొంటున్నారు. దీంతో వేసవిలో సంభవించే అగ్నిప్రమాదాల నివారణకు అటవీశాఖ అధికారులు ప్రత్యేక దృష్టి పెడుతున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలోనే వీర్నపల్లి మండలం ఎక్కువ శాతం అటవీ విస్తీర్ణం కలిగి ఉంది. అధికారులు అటవీ సంరక్షణలో భాగంగా కిలోమీటర్ల మేర 'ఫైర్‌లైన్స్' ఏర్పాటు చేస్తున్నారు.

అగ్ని ప్రమాదాలు జరిగే తీరు..

వేసవికాలంలో చెట్ల ఆకులు ఎక్కువగా రాలిపోతుంటాయి. అటవీప్రాంతంలోకి పశువులను తీసుకువెళ్లిన కాపరులు తునికాకు, ఇప్పపూలు, అడ్డపిక్కలు తదితర వాటి సేకరణ కోసం వెళ్లి ఎవరైనా అనుకోకుండా చుట్ట, సిగరెట్, బీడీ వంటివి తాగి పడేయడంతో ఎండిన ఆకులకు అంటుకొని మంటలు వ్యాప్తి చెందుతాయి. అలాగే ఆకతాయిల చేష్టల వల్ల కూడా అడవుల్లో అగ్నిప్రమాదాలు సంభవిస్తుంటాయి. గిరిజన ప్రాంతంలో అడవుల్లో ఏటా ఏదో ఒక ప్రాంతంలో అడవికి నిప్పు రాజుకుని మంటలు చెలరేగుతున్న పరిస్థితులు నెలకొంటున్నాయి. దీంతో అడవుల్లో అగ్నిప్రమాదాల నివారణకు అటవీ శాఖ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు.



ఫైర్‌లైన్ ఏర్పాటు చేస్తున్న కూలీలు

'ఫైర్ లైన్స్' ఏర్పాటు..

అడవుల్లో అగ్నిప్రమాదాల నివారణకు అటవీ శాఖ అధికారులు 'ఫైర్ లైన్స్' ఏర్పాటు చేస్తారు. అటవీ ప్రాంతంలో కాలిబాటలో ఐదు మీటర్ల వెడల్పుతో వీటిని ఏర్పాటు చేస్తారు. చుట్టుపక్కల ఉన్న ఎండిన ఆకులను కాలి బాటలో పరిచి నిప్పు పెడతారు. ఒకవేళ ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదం సంభవించి మంటలు చెలరేగినా ఈ దారివరకే మంటలు వ్యాప్తి చెంది ఆరిపోతాయి. మిగతా ప్రాంతానికి మంటలు వ్యాప్తి చెందకుండా ఫైర్ లైన్స్ అరికడతాయి. అడవుల సంరక్షణకు ప్రతిఏటా అటవీ శాఖ అధికారుల ఆధ్వర్యంలో వేసవి ప్రారంభంలో ముందస్తు చర్యలు చేపడుతారు. ఫైర్‌లైన్స్ కిలోమీటర్ల మేర ఏర్పాటు చేయడం ద్వారా అగ్ని ప్రమాదాలు రాకుండా అరికట్టవచ్చని అధికా రులు చెబుతున్నారు. గత ఏడాది తీసుకున్న చర్యల వల్ల అడవులు ఎక్కువ శాతం కాలిపో కుండా చూశామని అటవీశాఖ అధికారులు పేర్కొంటున్నారు.

రాత్రింబవళ్లు ప్రత్యేక నిఘా..

వేసవికాలంలో అటవీప్రాంతంలో సంభవించే అగ్నిప్రమాదాల నివారణకు రాత్రిపగలు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తామని అధికారులు చెబుతున్నారు. ఫైర్‌లైన్స్ ఏర్పాటు చేసి ఎండిన ఆకులను పరిచి అవి పూర్తిగా కాలిపోయే వరకూ కాపలా ఉంటారు. అలాగే అనుకోకుండా మంటలు వ్యాప్తి చెందితే అందుబాటులో ఉన్న సిబ్బంది మంటలను అదుపుచేస్తారు. వీటివల్ల అగ్నిప్రమాదాలు చోటు చేసుకోకుండా ఉంటాయి.



వీర్నపల్లిలో ఏర్పాటు చేసిన ఫైర్‌లైన్

శాటిలైట్ ద్వారా ముందస్తు సమాచారం..

అటవీప్రాంతంలో పెద్ద ఎత్తున అగ్నిప్రమాదం చోటు చేసుకుంటే శాటిలైట్ ద్వారా వచ్చే సమాచారాన్ని తక్షణమే అటవీశాఖ అధికారులకు సమాచారాన్ని చేరవేస్తుంది. దీనితో ఫారెస్ట్ అధికారులు అప్రమత్తమై ఆయా ప్రాంతానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువస్తారు.

అన్ని ప్రాంతాల్లో ఫైర్ లైన్స్ ఏర్పాటు చేయాలి..



- బండారి మహేష్, గొర్ల కాపరి, మద్దిమల్ల

మండలంలోని అన్నిప్రాంతాల్లో ముందస్తుగా అధికారులు ఫైర్‌లైన్స్ ఏర్పాటు చేయాలి. ఫైర్‌లెన్స్ నామమాత్రంగా కాకుండా అధికారులు ప్రత్యేక శ్రద్ధతో ఏర్పాటు చేయాలి. జంతువులు, అడవులకు నష్టం కలిగించొద్దు.

ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం..



- పద్మలత, ఎఫ్ఎస్‌వో, అల్మాస్‌పూర్

అడవులు, జంతువుల సంరక్షణ ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. వేసవిలో సంభవించే అగ్ని ప్రమాదాలను ఫైర్ వాచర్స్ ద్వారా నివారిస్తున్నాం. అటవీ ప్రాంతంలో కిలోమీటర్ల పరిధిలో ఫైర్ లైన్స్ ఏర్పాటు చేస్తున్నాం. వీటి ద్వారా మంటలను వ్యాప్తి చెందకుండా నివారించేలా కృషి చేస్తున్నాం. అలాగే అగ్నిప్రమాదాల నివారణపై పరిసర ప్రాంత ప్రజలకు పూర్తి అవగాహన కలిగిస్తున్నాం.

నిరుద్యోగుల కోసం పోరాటం చేసింది బీజేపీ మాత్రమే

- కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్



మాట్లాడుతున్న కేంద్రహోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్

భగత్‌నగర్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగులు, ఉద్యోగుల పక్షానపోరాటం చేసింది ఒక్క బీజేపీ మాత్రమే అని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. ఆదివారం నగరంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాలులో కరీంనగర్ ఎమ్మెల్సీ నియోజకవర్గ సోషల్‌మీడియా కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ అధి కారంలోకి రావాలనే లక్ష్యంతో పనిచేసే కార్యకర్తలు బీజేపీకి సొంత మన్నారు. నిరుద్యోగులు, ఉద్యోగుల పక్షాన పోరాటం చేస్తే లాఠీ దెబ్బలు తిన్నామన్నారు. గ్రూప్‌వన్ ఉద్యోగుల పక్షాన పోరాటం చేస్తే నిరుద్యోగుల మధ్యకు చేరి బీఆర్ఎస్‌నాయకులు విధ్వంసం సృష్టించాలని చూశారన్నారు. కాంగ్రెస్‌నేతలు ప్రతి పనికి 14నుంచి 18శాతం కమిషన్ అడుగుతున్నారన్నారు. 317జీవోకోసం ఎంపీ కార్యాలయంలో దీక్షచేస్తే కార్యాలయగేట్లను గ్యాస్ కట్టర్లతో పోలీసులు కోశారన్నారు. నా ఆఫీసును ఎక్స్‌కావేటర్‌తో కూల్చాలని కేసీఆర్ సీపీకి వార్నింగ్ ఇచ్చారన్నారు. అయినా ఏనాడు భయపడలేదన్నారు. బీజేపీ కార్యకర్తలు సిద్ధాంతాల కోసం ప్రాణాలను సైతం ఫణంగా పెట్టారన్నారు. సమావేశంలో బీజేపీ ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి, మాజీఎమ్మెల్సీ ఎస్వీఎస్ ప్రసాద్, మాజీమేయర్ సునీల్‌రావు, జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి జె సంగప్ప, తదితరులు పాల్గొన్నారు.

రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ

వేములవాడ కల్చరల్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. ఇతరప్రాంతాల నుంచివచ్చిన భక్తులు ముందుగా రాజన్న కళ్యాణకట్టలో తలనీలాలు సమర్పించుకుని ధర్మగుండంలో పవిత్రస్నానాలను ఆచరించారు. ధర్మదర్శనం, శీఘ్రదర్శనం క్యూలైన్‌ల ద్వారా భక్తులు ఆలయంలోకి చేరుకుని శ్రీపార్వతిపరమేశ్వరులను దర్శించుకున్నారు. రాజన్నకు అత్యంత ప్రీతిపాత్రమైన కోడెమొక్కు చెల్లించుకున్నారు. అనుబంధ ఆలయాల్లో భక్తులు కుంకుమ పూజలో పాల్గొని బద్దిపోచమ్మకు మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు ఆలయ ఈవో వినోద్‌రెడ్డి ఆధ్వర్యంలో భక్తులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



రాజన్న దర్శనం కోసం క్యూలైన్‌లో బారులు తీరిన భక్తులు

నరసింహుడి ఆలయంలో భక్తుల పూజలు



ధర్మపురి శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారిని దర్శనం చేసుకుంటున్న భక్తులు

ధర్మపురి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ధర్మపురిక్షేత్రంలో లక్ష్మీనరసింహస్వామి అనుబంధ ఆలయాల్లో భక్తులు ఆదివారం పూజలు నిర్వహించారు. మాఘమాసం బహుళ చవితి సందర్భంగా. సుదూరప్రాంతాల నుంచి క్షేత్రానికి భారీగా భక్తులు తరలివచ్చారు. పవిత్ర గోదావరి నదిలో భక్తులు స్నానాలు ఆచరించారు. నరసింహుని ఆలయంలో భక్తులు అభిషేకాది పూజలు, కుంకుమార్చన, స్వామి వారల నిత్య కల్యాణం జరిపించి పూజలు చేశారు. అందంగా పూలతో అలంకరించినస్వామి వారలకు ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ, వేద మంత్రోచ్ఛరణల మధ్య ఆలయ అర్చకులు పూజలు చేశారు. అనేక మంది భక్తులు స్వామి వారిని దర్శనం చేసుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, అభిషేక్ పౌరోహితులు బొజ్జ సంతోష్ కుమార్, సంపత్‌కుమార్, రాజగోపాల్, అర్చకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర పొల్యూషన్ బోర్డు సెక్రెటరీ పూజలు..

ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీ నరసింహస్వామి దేవాల యాన్ని రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్‌బోర్డు సెక్రెటరీ గుగులోతురవి దంపతులు ఆది వారం సందర్శించారు. ఆలయం వద్ద ఆయనకు అర్చకులు, సిబ్బంది మర్యాదపూర్వకంగా స్వాగతం పలికారు. అనంతరం ఆయన స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఉపప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు ఆయనను ఘనంగా ఆశీర్వదించారు. ఆలయ సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్ ఆయనకు స్వామి శేషవస్త్రం, ప్రసాదాలు అందించి ఘనంగా సత్కరించారు. అంతకుముందు ఆయన యమధర్మరాజు ఆలయం వద్ద గండదీపంలో నూనెపోసి భక్తి ప్రపత్తులు చాటుకున్నారు. అలాగే ఆయన అనుబంధ ఆలయాల్లో స్వామి వారిని దర్శనం చేసుకున్నారు. ఆయన వెంట అర్చకులు నేరెళ్ల విజయ్, సుముద్రాల వంశీకృష్ణ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అంజన్న సన్నిధిలో..

మల్యాల: కొండగట్టు ఆంజనేయస్వామిని ఆదివారం రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సెక్రెటరీ గుగులోతు రవి దర్శించుకున్నారు. సతీసమేతంగా ఆలయంకు వచ్చిన ఆయన స్వామి సన్నిధిలో పూజలు నిర్వహించారు. అనంతరం అర్చకులు స్వామివారి తీర్ధ ప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. ఆలయ పర్యవేక్షకులు హరిహరనాథ్, ఉపాధ్యాయుల చంద్రశేఖర్, ప్రధానర్చకులు రామకృష్ణ, ఉపప్రధానర్చకులు చిరంజీవి తదితరులు ఉన్నారు.



కొండగట్టు అంజన్న సన్నిధిలో రవి దంపతులు

వైభవంగా మల్లన్న బోనాలు



ఆత్మకూర్‌లో బోనాలతో బయలుదేరిన భక్తులు

మెట్‌పల్లి రూరల్, ఫిబ్రవరి, 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆత్మకూర్ గ్రామంలో మల్లన్న జాతరను యాదవులు ఘనంగా నిర్వహించారు. ఆదివారం మల్లన్నస్వామి ఆలయాన్ని పచ్చటితోరణాలతో శోభాయమానంగా అలంకరించారు. ఉదయంనుంచి మండలంలోని ఆయాగ్రామాల్లోని భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేసి ఒడి బియ్యం పోసి కానుకలు సమర్పించుకున్నారు. సాయంత్రం మహిళలు, భక్తులు ఉపవాస దీక్షలతో భక్తిశ్రద్ధలతో బోనం కుండలను అలంకరించి నైవేద్యాన్ని తయారు చేశారు. భక్తులు బోనమును నెత్తిన ఎత్తుకుని డప్పుచప్పులతో ఆలయానికి బయలుదేరారు. ఊరేగింపులో శివసత్తుల పూనకాలు, పోతురాజుల విన్యాసాలు కళాకారుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. భక్తులు బోనాలతో ఆలయం చుట్టు ప్రదక్షిణలు చేసి స్వామివారికి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈసందర్భంగా మాజీసర్పంచ్ చౌట్‌పల్లి లావణ్య-అంజయ్యతోపాటు పలువురు నాయకులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేకపూజలు జరిపి తీర్థా ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో యాదవ సంఘం, ఆలయాభివృద్ధి నాయకులు, సభ్యులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు కాంగ్రెస్ ఇన్‌చార్జిలు

కరీంనగర్ అర్బన్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికలకు కాంగ్రెస్‌పార్టీ ఇన్‌చార్జీలను నియమిస్తూ టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలోని కరీంనగర్, మానకొండూర్, చొప్పదండి, హుజురాబాద్ నియోజకవర్గాలతో పాటు వేములవాడ, సిరిసిల్ల, హుస్నాబాద్ నియోజకవర్గాలకు మంత్రి పొన్నంప్రభాకర్ ఇంచార్జి మంత్రిగా వ్యవహరిం చనున్నారు. అలాగే కరీంనగర్ నియోజకవర్గానికి ఎమ్మెల్సీ భానుప్రసాద్, పురుమల్ల శ్రీనివాస్ ఇంచార్జిలుగా, కోఆర్డినేటర్‌గా ఆయిల్‌ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ జంగ రాఘవరెడ్డి నియామకమయ్యారు. చొప్పదండి కోఆర్డినేటర్‌గా ఎనగల వెంకట్రాంరెడ్డి, మానకొండూర్‌కు గంప వేణుగోపాల్. హుజురాబాద్‌కు ఎండీ రియాజ్‌ను కోఆర్డినేటర్‌లుగా నియమించారు. హుజురాబాద్ నియోజకవర్గ ఇంచార్జిగా ఒడితెల ప్రణవ్‌బాబును నియమించారు. కాంగ్రెస్‌పార్టీ ఎమ్మెల్యేలను ఆయా నియోజకవర్గ ఇంచార్జిలుగా, కాంగ్రెస్ ఎమ్మెల్యే లేనిచోట డీఫీటెడ్ ఎమ్మెల్యే అభ్యర్థులను ఇంచార్జిగా నియమించారు. కరీంనగర్ సుడా చైర్మన్, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డికి నిజామాబాద్ అర్బన్ కోఆర్డినేటర్‌గా బాధ్యతలు అప్పగించారు.

ఘనంగా సంకష్టహర చతుర్థి పూజలు

ధర్మపురి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): సంకష్టహర చతుర్థి సందర్భంగా ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీ నరసింహస్వామి ఆలయ ఆవరణలోగల గణపతి ఆలయంలో ఆదివారం ఘనంగా అభిషేకం నిర్వహించారు. ఆలయ వేద పండితులు పాలెపు ప్రవీణ్ కుమార్‌శర్మ తదితర వేద బ్రాహ్మణుల మంత్రోచ్ఛరణల మధ్య ప్రత్యేక పూజలు, హారతి, మంత్రపుష్ప కార్యక్రమాలు నిర్వ హించారు. భక్తులు స్వామి వారిని దర్శనం చేసుకున్నారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, అర్చకులు ద్యావళ్ల విశ్వనాథం, సాయికుమార్, స్థానిక వేదపండితులు, అధిక సంఖ్యలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.



గణపతి ఆలయంలో అభిషేకాది పూజలు

కొన'సాగు'తున్న పనులు

- నత్తనడకన రైల్వే ఫ్లైఓవర్ పనులు
- భూ యజమానులకు అందని పరిహారం
- ఇబ్బంది పడుతున్న వాహనదారులు

పెద్దపల్లిటౌన్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): కూనారం ఫ్లైఓవర్ బ్రిడ్జి పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి. సౌత్ సెంట్రల్ రైల్వే చేపట్టే పనులు కొనసాగుతుండగా రోడ్డు భవనాల శాఖ పనులు నిలిచిపోయాయి. టెండర్ కాలం ముగిసిన పనులు 60 శాతం కూడా పూర్తి కాలేదు. దీంతో వాహనాదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

జిల్లా కేంద్రంలోని కూనారం రైల్వే గేటు వద్ద ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మించాలనే ప్రతిపాదనలు ఎప్పటి నుంచో ఉన్నాయి. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో బ్రిడ్జి నిర్మాణానికి రూ.119 కోట్లు కేటాయించింది. రోడ్లు భవనాల శాఖ రూ.34 కోట్లతో ట్రాక్‌కు ఇరువైపుల వంతెన నిర్మించాల్సి ఉంది. మిగితా రూ.85 కోట్లతో ట్రాక్ లైన్ పై సౌత్ సెంట్రల్ రైల్వే శాఖ స్టీల్ వంతెన నిర్మించాల్సి ఉంది. పట్టాలకు ఇరువైపుల 550 మీటర్ల వంతెన 46 పిల్లర్లతో ఆర్అండ్‌బీ శాఖ పనులు చేయాల్సి ఉంది. సర్వీస్ రోడ్డు అప్రోజ్ రోడ్డు, బ్రిడ్జీ పనులు నిలిచిపోయాయి. ఈ పనులకు రెండు సార్లు భూమి పూజ చేసినప్పటికి ప్రారంభం కాలేదు. ముచ్చటగా మూడో సారి 2022లో భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. సెప్టెంబరు 2024 నాటికి పూర్తి చేయాల్సి ఉండగా పనులు కొనసాగుతున్నాయి. రైల్వే శాఖ పనులు జరుగుతుండగా ఆర్అండ్‌బీ శాఖ పనులు ముందుకు సాగడం లేదు. డ్రాయింగ్ అప్రూవల్, ల్యాండ్ అక్వేషన్‌లో సమస్యలు, విద్యుత్ లైన్లు తొలగింపు తదితర అంశాలు నిర్మాణానికి అడ్డంకిగా మారాయి. ఈ సమస్యలను పరిష్కరించి భూసేకరణ చేసి నివేదికను ప్రభుత్వానికి పంపించారు. అయితే భూ యజమానులకు డబ్బులు చెల్లించకపోవడంతో రోడ్డు భవనాల శాఖ అధికారులు పనులు నిలిపివేశారు. పనులు నిలిచిపోవడంతో ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు గతేడాది మార్చిలో రైల్వే, ఆర్అండ్‌బీ అధికారులతో బ్రిడ్జి వద్ద సమావేశం నిర్వహించారు. అక్టోబర్ వరకు పూర్తి చేస్తామని కాంట్రాక్టర్ తెలిపాడు. ఇది జరిగి సుమారు ఏడాది కావస్తున్నా పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉన్నాయి.



కొసాగుతున్న రైల్వే ఫ్లైఓవర్ పనులు

భూ సేకరణ డబ్బులు చెల్లించలేదు

- ఆర్అండ్‌బీ ఈఈ డీ బావు సింగ్

బ్రిడ్జి నిర్మాణ పనుల్లో ఆలస్యం వాస్తవమే. అయితే భూ సేకరణ చేసి వివరాలు ప్రభుత్వానికి పంపించాం. డబ్బులు వచ్చాక రెవెన్యూ శాఖ అధికారులు భూమి యజమానులకు అందజేస్తారు. అప్పటి వరకు పనులు జరగవు.

వాహనదారుల ఇక్కట్లు

కూనారం రూట్‌లో రైల్వే గేటు పడిందంటే గంటకు పైమాటే వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది. మూడు నుంచి ఐదు రైళ్లు వెళితే గాని గేటు తెరవకపోవడంతో ఉద్యోగులు, విద్యార్థులు రోజూ ఇబ్బందులు పడుతున్నారు. 2022లో ఫ్లైవోర్ బ్రిడ్జి పనులు మొదలయినప్పటికి ఇప్పటికి పూర్తి కాకపోవడంతో ఏళ్ళ తరబడి సమస్య అలాగే వెంటాడుతోంది. గుంపుల తనుగుల మధ్య ఒక వంతెన, హుస్సేనిమియా వాగు పై చిన్నరాతుపల్లి, పెద్దరాతుపల్లి మధ్య మరో వంతెన, కునారం వద్ద మరో బ్రిడ్జి నిర్మించడంతో ఈ దారి గుండా వాహనాల రాకపోకల సంఖ్య పెరిగింది. మంథని వరంగల్, జమ్మికుంట, కాల్వ శ్రీరాంపూర్‌లకు వాహనాలు ఈ దారి గుండా వెళ్తున్నాయి. గేటు సమస్యతో ఈ దారి గుండా వెళ్ళే ప్రయాణికులు, వాహనదారులు అవస్థలు పడుతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో ఉన్న రోగులు, గర్భిణులు ఇబ్బందులు పడాల్సి వస్తుంది. పాఠశాలలకు, కాలేజీలకు వెళ్ళే విద్యార్థులు సమయానికి చేరుకోక చివాట్లు పడుతున్నారు. బయోమెట్రిక్ విధానంతో ఉద్యోగులు సరైన సమయానికి చేరుకోక పోవడంతో గైర్హాజరు కావాల్సి వస్తోంది. ఆటోలు, టాటా ఏసీలు గంటల తరబడి గేటు వద్దే ఉండడం వల్ల ట్రిప్పులు పడడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బ్రిడ్జి నిర్మాణ పనులు జరిగే చోట తాత్కాలిక రోడ్డు వేయకపోవడంతో దుమ్ముధూళితోనే గంటల తరబడి గడుపుతున్నారు. బ్రిడ్జి పనులు వెంటనే పూర్తి చేయాలని పలువురు కోరుతున్నారు.



గేటు వద్ద వాహనదారుల నిరీక్షణ

న్యూస్‌బాక్స్

'నరెడ్ల' సేవలు మరువలేనివి

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): లోక్‌సత్తా ఉద్యమ సంస్థ, వినియోగదారుల మండలి, కరీంనగర్ ఫిలిం సొసైటీ వ్యవస్థాపకుడు నరెడ్ల శ్రీనివాస్ సామాజిక సేవ, వినియోగదారుల హక్కుల కోసం చేసిన పోరాటాలు మరువలేనివని పలువురు వక్తలు కొనియాడారు. ఆదివారం స్థానిక ఫిలింభవన్‌లో నరెడ్ల శ్రీనివాస్ 4వ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కేసీసీ అధ్యక్షుడు చంద్రప్రభాకర్, కార్యదర్శి ఆర్.వెంకటేశ్వర్‌రావు, కోల రాంచంద్రారెడ్డి, వారాల మహేశ్, లక్ష్మణ్‌కుమార్, రఘురామ్, లక్ష్మీనారాయణ, పత్తి లక్ష్మారెడ్డి, ముజఫర్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల భవనానికి విరాళం

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): శ్రీసరస్వతీ విద్యాపీఠం ఆధ్వర్యంలో నగరంలో నిర్వహిస్తున్న శ్రీసరస్వతీ శిశుమందిర్ ఉన్నత పాఠశాలను ఇంటర్నేషనల్ స్కూల్‌గా మార్పు చేయాలని భవన నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ భవన నిర్మాణానికి కేశెట్టి మహేశ్ ఆయన తండ్రి జ్ఞాపకార్థం ఆదివారం లక్ష రూపాయలను విరాళంగా అందజేసినట్లు పాఠశాల ప్రధానాచార్యుడు సముద్రాల రాజమౌళి ప్రకటనలో తెలిపారు.పాఠశాల అధ్యక్షుడు కరుణాకర్‌రావు, కార్యదర్శి ఇంజనీర్ కోల అన్నారెడ్డి, ఇతర ప్రతినిధులు పాల్గొన్నట్లు పేర్కొన్నారు.

విద్యార్థులకు స్కాలర్‌షిప్ అందజేత

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ పద్మశాలి సంక్షేమ సంఘం, ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న హాస్టల్‌లో నిరుపేద విద్యార్థులకు ఆదివారం నగరంలోని ట్రస్టు భవన్‌లో సంఘం జిల్లా అధ్యక్షుడు మెతుకు సత్యం, ట్రస్టు అధ్యక్షుడు స్వర్గం మల్లేశం స్కాలర్‌షిప్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 40 సంవత్సరాలుగా నిరుపేద పద్మశాలి హాస్టల్ విద్యార్థులకు స్కాలర్ షిప్ అందజేస్తున్నట్లు చెప్పారు. చదువులో ప్రతిభ కనబర్చిన వారికి రూ.500 ప్రోత్సాహక నగదు బహుమతిని అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా కోశాధికారి అలుస భద్రయ్య, మోర రాజేశం, వంగర ఆంజనేయులు, పాము రాజేశం తదితరులు పాల్గొన్నారు.

మట్టి రోడ్లకు మహర్దశ


గుంటూరుపల్లి మట్టి రోడ్డు

- ఎస్సీ కాలనీల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు
- కరీంనగర్ మండలానికి రూ.2.46 కోట్లు
- ఎన్నికల కోడ్ తర్వాత పనులు

కరీంనగర్ రూరల్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు గ్రామాల్లో మట్టి రోడ్లకు మహర్దశ పట్టనుంది. గ్రామీణ ప్రాంత రహదారుల నిర్మాణం (సీఆర్ఆర్) పథకం కింద కరీంనగర్ నియోజకవర్గానికి రూ.5.16కోట్లు మంజూరవ్వగా కరీంనగర్ మండలానికి రూ.2.46కోట్ల నిధులు కేటాయించారు. గ్రామాల్లో పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ అధికారుల ప్రతిపాదనలతో రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ కాలనీల్లో సీసీ రోడ్లు నిర్మించేందుకు నిధులను మంజూరు చేసింది. రోడ్ల నిర్మాణంతో ప్రజల కష్టాలు దూరం కానున్నాయి. ఎన్నికల కోడ్‌తో పనులు ప్రారంభించలేకపోతున్నారు. ఎన్నికల్ కోడ్ తర్వాత పనులు ప్రారంభించనున్నట్లు అధికారులు తెలిపారు. కరీంనగర్ నియోజకవర్గంలో సీఆర్ ఆర్ పథకం కింద 20 పనులను గుర్తించి రూ.5.16 కోట్ల నిధులు మంజూరు చేశారు. నియోజకవర్గంలోని ఉమ్మడి కరీంనగర్ మండలాల పరిధిలోని గ్రామాల ఎస్సీ కాలనీల్లో మట్టి రోడ్లపై సీసీ రోడ్లు నిర్మించనున్నారు. గతంలో తాత్కాలిక మరమ్మతుల కోసం అరకొరగా నిధులు మంజూరయ్యేవి, ప్రస్తుతం ఆయా గ్రామాల్లోని ఎస్సీ జనాభా ప్రాతిపదికన పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ అధికారులు పనులను గుర్తించారు. ఈ పనులకు నిధులు మంజూరవగా ఎమ్మెల్సీ కోడ్ ముగిసిన అనంతరం సీఆర్ఆర్ నిధులతో సీసీ రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభించనున్నట్లు పీఆర్ ఏఈ తెలిపారు. కరీంనగర్ మండలంలో గ్రామాల వారిగా నగునూర్‌కు రూ.16.85 లక్షలు, జూబ్లీనగర్‌కు రూ.11.43 లక్షలు, ఫకీర్‌పేటకు రూ.13.87లక్షలు, చామనపల్లికి రూ.16.80లక్షలు, తహెర్ కొండాపూర్‌కు రూ.26.34 లక్షలు, ఎలబోతారానికి రూ.9.20లక్షలు ఇరుకుల్లకు రూ.34.05లక్షలు, గుంటూరుపల్లికి రూ.4.66 లక్షలు, చేగుర్తికి రూ.35.20 లక్షలు, గోపాల్‌పూర్‌కు రూ.19.66 లక్షలు, దుబ్బపల్లికి రూ.2.07 లక్షలు, వల్లంపహాడ్‌కు రూ.7.95లక్షలు, చెర్లబూత్కూర్‌కు రూ.17.36 లక్షలు, మొగ్దుంపూర్‌కు రూ.26.34 లక్షల చొప్పున మొత్తం మండలానికి 2కోట్ల 46లక్షల 77వేల రూపాయలు మంజూరయ్యాయి.

మానవత్వం చాటిన పోలీసులు


శ్రీనివాస్‌తో ఎస్సై రాజన్న, సిబ్బంది

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లో రోడ్డుపై తిరుగుతున్న మతిస్థిమితం లేని ఒక వ్యక్తిని చేరదీసి కరీంనగర్ ఒకటో ఠాణా ఎస్సై, సిబ్బంది మానవత్వాన్ని చాటుకున్నారు. కరీంనగర్ ఒకటో ఠాణా పరిధిలో మతిస్థిమితంలేని శ్రీనివాస్(42) ఒంటిపై సరైన దుస్తులు లేకుండా, కాలికి గాయంతో రోడ్డుపై తిరుగుతున్నాడు. గమనించిన ఎస్సై రాజన్న సిబ్బందితో కలిసి చేరదీశారు. స్నానం చేయించి, కొత్త దుస్తులు ధరింపజేసి, భోజనం చేయించారు.కాలికి గాయంతో ఇబ్బందిపడడాన్ని గమనించి ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. శ్రీనివాస్ పూర్తి వివరాలు తెలియలేదని ఎస్సై తెలిపారు. హెడ్ కానిస్టేబుల్ మహ్మద్ అజీం, కానిస్టేబుళ్లు కుమార్, భూపాల్‌రెడ్డి తదిరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమాన్ని పట్టించుకోని ప్రభుత్వాలు

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): ప్రజల సంక్షేమాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణస్వరూప్ అన్నారు. ఆదివారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల కుల గణన సక్రమంగా నిర్వహించలేదని, వారి సంఖ్యను తక్కువగా చూపారని ఆరోపించారు.

దళిత బహుజన పార్టీ నగర అధ్యక్షుడిగా నగరానికి చెందిన గోత్రాల శ్రీనివాస్‌ని నియమించారు. ఆదివారం ప్రెస్‌భవన్‌లో నియామక పత్రాన్ని అందజేశారు. జిల్లా ఇన్‌చార్జి రాగి రాజేశ్, పెద్దపల్లి జిల్లా ఇన్‌చార్జి రామచందర్, జిల్లా ఇన్‌చార్జి చిప్పర్తి కరుణాకర్, హన్మకొండ ఇన్‌చార్జి ఆకుతోట సతీష్, ఎస్సీ, ఎస్టీ అడ్వకేట్స్ ఫోరం రాష్ట్ర ప్రధానకార్యదర్శి రాజలింగం, మాలమహానాడు సందబోయిన జిల్లా అధ్యక్షుడు రాకేశ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీలుగా బీజేపీ అభ్యర్థులను గెలిపించండి



వాకర్స్‌ను ఓట్లు అభ్యర్థిస్తున్న నరహరి లక్ష్మారెడ్డి

భగత్‌నగర్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీలుగా బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని పీఆర్టీయూ మాజీ నాయకుడు నరహరి లక్ష్మారెడ్డి కోరారు. ఆదివారం విద్యానగర్‌లోని పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో వాకర్స్‌ను ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా మల్క కొమురయ్య, పట్టభద్రుల ఎమ్మెల్సీగా డాక్టర్ అంజిరెడ్డిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోరెడ్డి నరేందరెడ్డి, బండ రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీగా బీజేపీ అభ్యర్థి చిన్నమలై అంజిరెడ్డిని గెలిపించాలని కోరుతూ బీజేపీ పశ్చిమ జోన్ కన్వీనర్ జాడి బాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ప్రచారం నిర్వహించారు. గోదావరి నరేష్, పీచర విష్ణు ప్రసాద్‌రావు, వంగల రవి, అన్నా వినీత్, ప్రభారిలు, బండారి ప్రవీణ్, బండారి రితిక పాల్గొన్నారు.

'కలల లోగిలి' పుస్తకావిష్కరణ

కరీంనగర్ కల్చరల్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): భవానీ సాహిత్య వేదిక ఆధ్వర్యంలో వైరాగ్యం ప్రభాకర్ అధ్యక్షతన ఆదివారం స్థానిక వాగేశ్వరి డిగ్రీ కళాశాలలో నగునూరి రాజన్న కవిత్వం 'కలల లోగిలి' పుస్తకాన్ని సాహితీ కిరణం సాహిత్య మాస పత్రిక సంపాదకుడు పొత్తూరు సుబ్బారావు ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మానవీయ విలువల లోగిలే కవిత్వ లోగిలి అని అన్నారు. కవి మారుతున్న ప్రపంచ పరిణామాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం కవి, విమర్శకుడు దాస్యం సేనాధిపతి రాజన్న రాసిన హైకూల సంపుటి 'వెలుగు పూలు' పుస్తకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. కవిత్వంలో శీర్షిక ప్రధానమన్నారు. శైలి, కవితా రచన నడక, ముగింపు పాఠకున్ని చదివింపజేసేలా ఉండాలన్నారు. జిల్లా సాంస్కృతిక సంస్థలు, కళాకారుల సమాఖ్య అధ్యక్షుడు వైఎస్ శర్మ, మాజీ కార్పొరేటర్ కొలగాని శ్రీనివాస్, మాడిశెట్టి గోపాల్, కేవీ గోపాలాచార్య, భవాని, సంగనభట్ల చిన్న రామకృష్ణయ్య, జనగాని యుగేందర్, నడిమెట్ల రామయ్య, ఇటిక్యాల రాము, మఠం సాంబమూర్తి, విలాసాగరం రవీందర్, గంప ఉమాపతి, వెల్ముల జయపాలరెడ్డి, దామరకుంట శంకరయ్య, దేవి యాదగిరి, ఎలగొండ రవి, యడవెల్లి తిరుమలరెడ్డి, శ్యాంసుందర్, సింగిరిరెడ్డి రాజారెడ్డి, రాంమోహన్, పాండురంగం తదితరులు పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సభ్యులు

సీఐటీయూ డైరీ ఆవిష్కరణ

భగత్‌నగర్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): సీఐటీయూ భవన నిర్మాణ కార్మికుల డైరీ, క్యాలెండర్‌ను నగరంలోని ముకుందలాల్ మిశ్రా భవన్‌లో సంఘం నాయకులు ఆదివారం ఆవిష్కరించారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎడ్ల రమేష్, జిల్లా అధ్యక్షుడు కదిరె రమేష్, జగదీష్, సారయ్య, రావుల ఎల్లయ్య, వెంకన్న, మల్లారెడ్డి, రాజు, చక్రపాణి, లింగారెడ్డి, శ్రీధర్, రవి, రాజేశం పాల్గొన్నారు.

సన్‌రైజ్ ఆస్పత్రి ప్రారంభం


ఆస్పత్రిని ప్రారంభిస్తున్న కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్, ఎమ్మెల్యే గంగుల కమలాకర్

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ఆదర్శనగర్ బోర్డు ఎదురుగా మంచిర్యాల చౌరస్తా సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన సన్‌రైజ్ ఆస్పత్రిని ఆదివారం ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, మేడిపల్లి సత్యం, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, పాల్వాయి హరీష్ బాబుతో కలిసి కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ ఉత్తర తెలంగాణ ప్రజల ఆరోగ్య సంరక్షణ కోసం ఆసుపత్రిని ఏర్పాటు చేశామన్నారు. 150 పడకలు, అత్యాధునిక వైద్యపరికరాలు, అత్యవసర సమయాల్లో అనుభవజ్ఞులైన వైద్య నిపుణులతో వైద్య సేవలు అందించనున్నట్లు చెప్పారు. కరీంనగర్‌లో మొట్ట మొదటిసారిగా 50 పడకల ఐసీయూ, వీఐపీ రూములు, అత్యాధునిక క్యాథ్‌ల్యాబ్, వారానికి 24 గంటలపాటు క్రిటికల్ కేర్ వైద్యసేవలు, ప్రత్యేకమైన డయాలసిస్ విభాగం, సీనియర్ వైద్యులతో 21 స్పెషాలిటీ, సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఆస్పత్రి నిర్వాహకులు డాక్టర్ జె.సురేష్, డాక్టర్ ఎన్.ప్రవీణ్‌సింగ్, డాక్టర్ కొండపాక కిరణ్, డాక్టర్ వెంకటరెడ్డి, డాక్టర్ దామోదర్, డాక్టర్ కృష్ణచైతన్య, డాక్టర్ వంశీధర్, డాక్టర్ రాము, డాక్టర్ శ్రవణ్, డాక్టర్ భువనేశ్వర్‌రావు, డాక్టర్ చీటి కార్తిక్ తదితరులు పాల్గొన్నారు.

ది ప్లే స్కూల్‌లో గ్రాడ్యుయేషన్ డే

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): నగరంలోని జగిత్యాల రోడ్డులో ది ప్లే స్కూల్ కిండర్ గార్డెన్ పాఠశాలలో వార్షిక గ్రాడ్యుయేషన్ డే ఆదివారం ఘనంగా నిర్వహించారు. బొల్ల జయశ్రీ, డాక్టర్ రఘురామన్, హైదరాబాద్ జిల్లా అండ్ సెషన్స్ జడ్జి అర్జున్, సీనియర్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ విశాల్ గౌతమ్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. అంతకుముందు విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పాఠశాల చైర్మన్ డాక్టర్ సుధాకర్‌రావు పొల్సాని తదితరులు పాల్గొన్నారు.

జాతీయ తైక్వాండో క్రీడాకారులకు సన్మానం

కరీంనగర్ స్పోర్ట్స్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): జాతీయ తైక్వాండో పోటీల్లో పతకాలు సాధించిన జిల్లా క్రీడాకారులను నగరంలోని సప్తగిరికాలనీ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం సన్మానించారు. ఇటీవల హైదరాబాద్‌లోని కోట్ల విజయభాస్కర్ రెడ్డి స్టేడియంలో నిర్వహించిన జాతీయస్థాయి పోటీల్లో జిల్లా నుంచి డి.శ్రీనిధి కాంస్యం, ఎ.విష్ణుతేజ కాంస్యం, ఎస్.విహాన్‌రావు కాంస్య పతకాలను సాధించారు. ఈ కార్యక్రమంలో తైక్వాండో కోచ్ పెండ్లి రాజేందర్, పెద్దపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి సతీష్ కుమార్, వాకర్స్ సంఘ డిప్యూటీ గవర్నర్ గడప కోటేష్ కుమార్, ప్రధాన కార్యదర్శి నరసింగోజు రామకృష్ణ, ఉపాధ్యక్షుడు పాక నందు, సత్యనారాయణ రెడ్డి, యూసుఫ్, రాజయ్య, కనుకయ్య, లక్ష్మీనారాయణ, కెఎం రెడ్డి, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రుల సంక్షేమానికి కృషి

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల సంక్షేమానికి అహర్నిశలు కృషి చేస్తానని కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థి యాదగిరి శేఖర్‌రావు అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం ఆయన నగరంలో పలువురు పట్టభద్రులను కలిశారు. ఎన్నికల్లో మొదటి ప్రాధాన్య ఓటు వేసి గెలిపించాలని కోరారు. అనంతరం కొత్తపల్లి, గంగాధర, జగిత్యాల, మంచిర్యాల, జన్నారంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

కేంద్ర బడ్జెట్‌పై 18, 19న వామపక్షాల నిరసన

భగత్‌నగర్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): కేంద్ర బడ్జెట్‌పై వామపక్షాల పార్టీల ఆధ్వర్యంలో ఈ నెల 18, 19వ తేదీల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి, సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి, సీపీఐ ఎంఎల్‌మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి జుపాక శ్రీనివాస్ సంయుక్త ప్రకటన విడుదల చేశారు. కేంద్ర బడ్జెట్‌లో మోదీ ప్రభుత్వం ప్రజల మౌలిక అవసరాలకు కేటాయింపులు తగ్గించిందని, సంపన్నులకు రాయితీలు పెంచిందని తెలిపారు. గ్రామీణ ఉపాధి హామీ పథకానికి కేటాయింపులు పెంచాలని పేర్కొన్నారు.

ఇల్లందకుంటలో సామూహిక వివాహాలు


నూతన జంటలను ఆశీర్వదిస్తున్న వొడితెల ప్రణవ్

ఇల్లందకుంట, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో ఆదివారం అన్నా చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో సామూహిక వివాహాలు జరిగాయి. 11మంది జంటలకు వివాహాలు చేసుకున్నారు. అన్నా చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో జంటలకు పుస్తె, మట్టెలను ట్రస్టు చైర్మన్ పత్తి కృష్ణారెడ్డి ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జీ వొడితెల ప్రణవ్ హాజరై జంటలను ఆశీర్వదించారు. నిరుపేద కుటుంబాలకు చెందిన వారికి వివాహం జరపడం గొప్ప విషయమని అన్నారు. అనంతరం పత్తి కృష్ణారెడ్డి దంపతులను ప్రణవ్ శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో పెద్దికుమార్, సదానందం, తక్కళ్లపల్లి రాజేశ్వర్‌రావు, సుంకరి రమేష్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గెలుపు ఓటములకు అలవాటుపడితేనే ఉన్నత శిఖరాలకు



విజేతలకు చెక్కు, ట్రోఫీ అందజేస్తున్న సర్దార్ రవీందర్ సింగ్

తిమ్మాపూర్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): గెలుపు ఓటములకు అలవాటుపడితేనే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సర్దార్ రవీందర్ సింగ్ అన్నారు. మండలంలోని మన్నెంపల్లి గ్రామంలో పొన్నం చంద్రయ్యగౌడ్ స్మారకార్థం బీఆర్ఎస్ నాయకుడు, మాజీ ఉపసర్పంచ్ పొన్నం అనిల్‌గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన నియోజకవర్గస్థాయి క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం ముగిసింది. ఈ కార్యక్రమానికి రవీందర్ సింగ్ ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు.

సైబర్ నేరాలపై యువకులకు అవగాహన

హుజూరాబాద్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని హైస్కూల్ మైదానంలో యువకులకు సైబర్‌నేరాలపై ఏఎస్ఐ కమల ఆదివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సైబర్‌నేరాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. తెలియని వ్యక్తులకు వ్యక్తిగత సమాచారం, ఓటీపీలు చెప్పరాదన్నారు. మొబైల్ ద్వారానే 80శాతం సైబర్ నేరాలు జరుగుతున్నాయన్నారు. యువకులు అవగాహన పెంచుకొని మోసాలకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, యువకులు పాల్గొన్నారు.

అలంకారప్రాయంగా క్రీడాప్రాంగణాలు

మానకొండూర్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో క్రీడలను ప్రోత్సహించి నైపుణ్యంగల క్రీడాకారులను తయారు చేయాలనే ఉద్దేశ్యంతో ప్రతిగ్రామంలో లక్షల రూపాలయలను వెచ్చించి ప్రభుత్వం తెలంగాణ క్రీడా ప్రాంగణాలను నెలకొల్పింది. మండలంలో 27గ్రామపంచాయతీలుండగా నిజాయితీగూడెంలో స్థలం లేక క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేయలేదు. మిగతా 26గ్రామాల్లో ఒక్కొక్క దానికి రూ.2లక్షల ఎస్టిమేషన్ ఉన్నప్పటికీ లక్ష రూపాయల వరకే చెల్లింపులు జరిగాయి. ఈ క్రీడా ప్రాంగణంలో వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, ఆర్చీల నిర్మాణం ఎంతో ఆర్భాటంగా పూర్తి చేశారు. రంగపేట క్రీడాప్రాంగణం సుమారు 4కిలోమీటర్ల దూరంలో యువకులకు ఉపయోగపడకుండా ఉంది. శ్రీనివాస్‌నగర్ క్రీడా ప్రాంగణం గుట్టకు ఆనుకొని ఉంది. అక్కడ చెట్లు, బండరాళ్లు ఉండి ఆటలు ఆడుకోవడానికి అనువుగా లేకుండా పోయిందని గ్రామ యువత వాపోతోంది. ప్రతి గ్రామానికి 16రకాల ఆట వస్తువులు కల్గిన క్రీడాకిట్లను అధికారులు పంపిణీ చేశారు. గ్రామాల్లో పంపిణీ చేసిన కిట్లు మూలనపడడంతో యువత క్రీడాప్రాంగణాలకు దూరం అయ్యారు. దీంతో క్రీడాప్రాంగణాలు గ్రామాల్లో అలంకార ప్రాయంగా దర్శనమిస్తున్నాయి.



గుట్టకు ఆనుకొని ఉన్న శ్రీనివాస్‌నగర్ క్రీడాప్రాంగణం

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

హుజూరాబాద్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): రాజన్నసిరిసిల్లలో జరిగిన రాష్ట్రస్థాయి కరాటే చాంపియన్‌షిప్‌పోటీల్లో హుజూరాబాద్ విద్యార్థులు ఆదివారం ప్రతిభ కనబర్చారు. 12 సంవత్సరాల కేటగిరి కటాస్‌లో శ్రీవెన్నెల గోల్డ్ మెడల్, 8సంవత్సరాల విభాగంలో కటాస్‌లో గౌసియాఫాతిమా గోల్డ్‌మెడల్, 15సంవత్సరాల విద్యార్థినుల విభాగంలో ఆరెంజ్‌బెల్ట్ కేటగిరిలో కటాస్‌లో జమ్మికుంటకు చెందిన జున్ను కావ్య గోల్డ్‌మెడల్, 13సంవత్సరాల విభాగం కటాస్‌లో అనుశ్రీ సిల్వర్‌మెడల్, 10సంవత్సరాల విభాగం కేటగిరి కటాస్‌లో సహస్ర గోల్డ్ మెడల్, 13సంవత్సరాల విద్యార్థుల విభాగంలో వైట్‌బెల్ట్ కేటగిరిలో రంగాపూర్‌కు చెందిన ఆదిత్యవర్ధన్ గోల్డ్‌మెడల్, 11సంవత్సరాల ఎల్లో బెల్ట్ కేటగిరి కటాస్‌లో సాయిచరణ్ గోల్డ్‌మెడల్ సాధించారు. పథకాలు సాధించిన విద్యార్థులతోపాటు కరాటే మాస్టర్ ఎస్కెజలీల్‌ను పలువురు అభినందించారు.

నియామకం

హుజూరాబాద్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కిందివాడలోని మస్జీద్ ఏ బషీర్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం జామామస్జీద్ అధ్యక్షుడు ముజాహిద్ హుస్సేన్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా షేక్ ఫయాజ్, గౌరవ అధ్యక్షుడిగా మహ్మద్ యాకుబ్, సెక్రటరీగా మహ్మద్‌అజ్మత్, జాయింట్ సెక్రెటరీగా ఫారోక్, ఆర్గనైజషన్ సెక్రెటరీగా యాకుబ్, చీఫ్ అడ్వైజర్‌గా రఫీ, కోశాధికారిగా మహ్మద్‌నేహల్, ఉపాధ్యక్షులుగా మహ్మద్ ఆరిఫ్, మహ్మద్ అప్సర్, కార్యవర్గ సభ్యులుగా సాహెబ్‌హుస్సేన్, నదీమ్, సమీర్, ఇస్మాయిల్, యాకుబ్, మహ్మద్ బాబా, యాకుబ్ పాషా ఎన్నికయ్యారు.

మల్లికార్జున స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే

తిమ్మాపూర్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మొగిళిపాలెం గ్రామంలోగల మల్లికార్జునస్వామిని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఆదివారం దర్శించుకొని ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆ సందర్భంగా ఆలయ నిర్వాహకులు ఎమ్మెల్యేకు ఘనం స్వాగతం పలికి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

గృహప్రవేశ వేడుకకు హాజరైన కవ్వంపల్లి

జమ్మికుంట: జమ్మికుంటమున్సిపల్ పరిధిలోని ఆబాదిజమ్మికుంటకు చెందిన ఐఏఎస్ ఆఫీసర్ (జార్ఖండ్ రాష్ట్రం దుమ్కా జిల్లా కలెక్టర్) దొడ్డె ఆంజనేయులు గృహప్రవేశం కార్యక్రమానికి మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, హుజూరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ వొడితెల ప్రణవ్ హాజరయ్యారు.


ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణకు ట్రస్ట్ చిత్రపటం బహూకరిస్తున్న ఐఏఎస్ దొడ్డె ఆంజనేయులు

వారికి శ్రీదొడ్డె పోచయ్య మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ చిత్రపటాన్ని బహూకరించారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


మొక్కలు నాటుతున్న మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

మొక్కలు నాటుదాం.. పర్యావరణాన్ని పరిరక్షిద్దాం

గంగాధర, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు కృషిచేయాలని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. మాజీ సీఎం కేసీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకుని ముందస్తుగా బూరుగుపల్లిలో ఆయన మొక్కలునాటారు. అంతకు ముందు బీఆర్ఎస్‌యూత్ నాయకుడు రాగూర్ ఆధ్వర్యంలో గంగాధరలో గ్రీన్‌ఇండియా పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సాగిమహిపాల్ రావు, దూళం శంకర్‌గౌడ్,అజ్జు,మధు,హరికృష్ణతదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థుల పక్షాన నాయకుల ప్రచారం

మానకొండూర్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండపల్కల, ఈదులగట్టెపల్లి గ్రామాల్లో ఆదివారం కాంగ్రెస్, బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థుల పక్షాన నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డికి ఓటు వేయాలని కొండపల్కలలో ఆపార్టీ నాయకులు అభ్యర్థించారు. ఈదులగట్టెపల్లిలో బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డికి ఓటు వేయాలని ఆ పార్టీ నాయకులు అభ్యర్థించారు.

కేసీఆర్‌కు పెయింటింగ్ బహూకరణ

జమ్మికుంట, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట పట్టణానికి చెందిన ప్రముఖ చిత్రకారుడు అంబాల ప్రభాకర్ తాను స్వయంగా వేసిన కేసీఆర్ పెయింటింగ్ ఫోటోను ఆదివారం కేసీఆర్‌కు అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపాడు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

వీణవంక, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్సింగాపూర్ గ్రామంలో ఉమామహేశ్వర ఆలయంలో మహాశివరాత్రి వాల్‌పోస్టర్‌ను భక్తులు, గ్రామస్తులు ఆవిష్కరించారు. ఈనెల25న ధ్వజారోహనం, రుద్రహోమం, 26న మహాశివరాత్రి జాతర, రుద్రాభిషేకం, బండ్లు తిరుగుట వంటికార్యక్రమాలు చేపడుతున్నట్లు ఆలయఅర్చకుడు ఫణిందర్‌శర్మ తెలిపారు. భక్తులు అధికసంఖ్యలోపాల్గొనాలని కోరారు.

ప్రసన్న హరికృష్ణను ఆశీర్వదించాలి

సైదాపూర్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీచేస్తున్న ప్రసన్నహరికృష్ణకు పట్టభద్రులు ఓటేసీ ఆశీర్వదించి శాసనమండలికి పంపించాలని బీఎస్పీ, బీసీ సంఘాల నాయకులు కోరారు. ఆదివారం మండలకేంద్రంలో ప్రసన్న హరికృష్ణకు మద్దతుగా బీఎస్పీ, బీసీ సంఘాల నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మొదటి ప్రాధాన్యత ఓటేసీ భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో పచ్చిమట్ల రవీందర్‌గౌడ్, వేల్పుల రాజు, పొడిశెట్టి అశోక్, పంజాల కొంరయ్య, జనగాని రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు

జమ్మికుంటరూరల్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని హౌసింగ్‌బోర్డు కాలనిలోగల శ్రీషిర్డి సాయి బాబా ఆలయ 16వ షోడశ వార్షికోత్సవాల్లో భాగంగా ఆదివారం ప్రత్యేకపూజలు నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో తరలి వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు మహాఅన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీచైర్మన్ తక్కళ్లపల్లి రాజేశ్వర్‌రావు దంపతులు పాల్గొన్నారు.

వాటర్ ట్యాంక్ వితరణ

తిమ్మాపూర్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోలంపల్లి గ్రామంలో గల శివఅభయాంజనేయస్వామి దేవాలయానికి నుస్తులాపూర్ గ్రామానికి చెందిన బుదారపు శ్రీనివాస్ 1500లీటర్ల సామర్థ్యం గల వాటర్ ట్యాంక్‌తోపాటు దానికి సంబంధించిన వస్తువులు దాదాపు 30వేల రూపాయ విలువచేసే సామాగ్రి అందజేశారు.